https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే సారధ్యంలో

# చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 13 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ గురువారం,అక్టోబర్,8, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-




## 28న జర్నలిస్టుల ఛలో ఢిల్లీ

### జంతర్ మంతర్ లో ఒక రోజు నిరసన

**హైదరాబాద్( డీకే చాటింపు)** ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం “జర్నలిస్టుల రక్షణ చట్టం”అమలు చేయాలనే డిమాండ్ తో ఈ నెల 28వ తేదీన “ఛలో ఢిల్లీ” కార్యక్రమం చేపడుతున్నట్లు ఐఎఫ్ డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సభ్యులు,తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లు తెలిపారు.కేంద్ర ప్రభుత్వం పరిధిలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఆరోజు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే వందలాది మంది జర్నలిస్టులతో ఢిల్లీలోని జంతర్ మంతర్ లో ధర్నా జరుగుతుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లతారని తెలిపారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, హత్యలను అరికట్టి రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో ప్రత్యేక చట్టం చేయాలన్న ఐఎఫ్ డబ్ల్యూజే దీర్ఘకాలిక డిమాండ్ ను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. అదే విధంగా సీనియర్ జర్నలిస్టుల కోసం జాతీయ పెన్షన్ విధానం ప్రవేశపెట్టాలని, జాతీయ మీడియా కమీషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులకు రైల్వే రాయితీ పాస్ లను పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. దీర్ఘ కాలిక ఈ డిమాండ్ల సాధనకై 28న తలపెట్టిన “ఛలో ఢిల్లీ” కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## మెట్రో డీలక్స్ సిటీ బస్సులో

# జర్నలిస్టు పాసు చెల్లాదా..!?

### - ఫరూక్ నగర్ బస్ డిపో కండక్టర్ నుంచి జర్నలిస్టుకు ఎదురైన అనుభవం...

### - మార్గమధ్యంలోనే జర్నలిస్టును దింపివేసిన కండక్టర్.. - కండక్టర్ పై చర్యలకు జర్నలిస్టు సంఘాల డిమాండ్..

**హైదరాబాద్,(డీకే చాటింపు):** హైదరాబాద్ జిహెచ్ఎంసి పరిధిలో ప్రయాణించే ఆర్టీసీ బస్సుల్లో జర్నలిస్ట్ బస్సు పాస్ ఉచిత సౌకర్యం ఉన్నప్పటికీ ఓ కండక్టర్ ఈ బస్సు పాస్ చెల్లదు..!టికెట్ తీసుకోవాలనిసిందిగా కరాఖండిగా తెలిపి సదరు జర్నలిస్టును బస్సు నుంచి దింపిన సంఘటన బుధవారం మధ్యాహ్నం ఒకటిన్నర గంటల సమయంలో చోటుచేసుకుంది.ఫరూఖ్ నగర్ బస్ డిపో కండక్టర్ నిర్వహకంతో ఆ జర్నలిస్టు నడి మధ్యలో దిగవలసి వచ్చింది.ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.డీకే చాటింపు దినపత్రిక జర్నలిస్టు లింగ స్వామి బుధవారం మధ్యాహ్నం ఒకటిన్నర గంటల సమయంలో ఫరూఖ్ నగర్ డిపోకు చెందిన మెట్రో డీలక్స్ సిటీ బస్సులో ప్రయాణిస్తున్నారు.టీజీ-09 జడ్ 0073 అనే నెంబర్ గల బస్సు కండక్టర్ ఈ బస్సులో ఈ జర్నలిస్ట్ బస్ పాస్ చెల్లదు.కావున మీరు టికెట్ తీసుకోవాల్సిందిగా సూచించారు.కార్డులో నిబంధనలు ఒకసారి పరిశీలించుకోవాల్సిందిగా సదరు జర్నలిస్టు లింగ స్వామి కండక్టర్ కు సూచించినప్పటికీ ఆ కండక్టర్ మాత్రం తాము పట్టిన కుందేలుకు మూడే కాలు అనే సామెత మాదిరిగా వ్యవహరించారు.టికెట్ తీసుకోవాలని హెచ్చరించడంతో గత్యంతరం లేక సదరు రిపోర్టర్ మధ్య మార్గంలోనే బస్సు నుంచి దిగవలసి వచ్చింది.ఆర్టీసీ బస్సుల్లో చదువు రాని వాళ్ళను కండక్టర్ గా పెట్టుకోవడం తోనే తమకు ఈ పరిస్థితి ఉత్పన్నమైందని సదరు జర్నలిస్టు లింగ స్వామి ఆందోళన వ్యక్తం చేశారు.ఆ బస్సు కండక్టర్ జర్నలిస్ట్ బస్సు పూర్తిస్థాయి నిబంధనాలను పరిశీలించకుండానే తమను అకరణంగా మధ్య మార్గంలో దించేశారని జర్నలిస్టు లింగ స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి జర్నలిస్టు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన సదరు కండక్టర్ పై చర్యలు చేపట్టాలని జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.















## ప్రభుత్వాధిపతిగా 25 ఏళ్లు..

# వినాయకుడి గుడిలో ప్రధాని మోదీ పూజలు



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసేవలో కీలక ఘట్టం చోటుచేసుకున్నాయి. ప్రభుత్వాధిపతిగా ఆయన 25 ఏళ్లు గడిపారు. ఈ నేపథ్యంలో ఇవాళ ఢిల్లీలోని సరోజినినగర్‌లో ఉన్న శ్రీ వినాయక్ మందిర్‌లో ఆయన ప్రత్యేక పూజలు, అర్చన చేశారు. మరింత దీక్షతో దేశానికి సేవ చేయాలన్న సంకల్ప ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వాధిపతిగా గత 25 ఏళ్ల నుంచి మోదీ కొనసాగుతున్నారు. తొలుత గుజరాత్‌కు మూడు సార్లు ముఖ్యమంత్రిగా చేశారు. ఆ తర్వాత వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన ఆయన దేశ ప్రధానిగా కొనసాగుతున్నారు. 2001, అక్టోబర్ 7 నుంచి ఆయన ప్రభుత్వ అధిపతిగానే కొనసాగుతున్నారు.

ఈ నేపథ్యంలో విఘ్నహరుడు వినాయకుడికి ఆయన ఇవాళ ఢిల్లీలో పూజలు చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న తన కుటుంబ సభ్యులకు సంతోషాన్ని, సౌభాగ్యాన్ని, ఆరోగ్యాన్ని ఇవ్వాలని ఆ గణేశుడిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. తన ఎక్స్ అకౌంట్‌లో హిందీలో ఆయన ఓ పోస్టు చేశారు. ప్రతి ఒక్కరిపై వినాయకుడి ఆశీస్సులు ఉండాలని, ప్రగతి బాటలో దేశం ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు దసరా కానుక..

# రెండు డీఏలు మంజూరు



**హైదరాబాద్,అక్టోబర్,07:** దసరా పండుగ వేళ తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త అందించింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు డీఏలు (కరువు భత్యం) మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 1న జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో రెండు డీఏలు చెల్లించేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. తాజాగా ఇందుకు సంబంధించిన జీవోను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ డీఏల పెంపుతో రాష్ట్ర ప్రభుత్వంపై ఏటా సుమారు రూ. 2,500 కోట్ల అదనపు భారం పడుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. జనవరి 2024 నుంచి డీఏను 37.31 శాతానికి పెంచింది. అలాగే 2015 పే స్కేల్ ఉద్యోగులకు డీఏ 81.72 శాతానికి, 2020 పే స్కేల్ ఉద్యోగులకు 40.04 శాతానికి, 2016 పే స్కేల్ ఉద్యోగులకు 53 శాతానికి, 2006 పే స్కేల్ ఉద్యోగులకు 246 శాతానికి పెంచింది. యూజీసీ, ఏఐసీటీఈ పరిధిలోని ఉద్యోగులకు కూడా డీఏ పెంపు వర్తించనుంది. పెంచిన డీఏను అక్టోబర్ నెల జీతంతో కలిపి చెల్లించనున్నారు. నవంబర్ 1న ఉద్యోగుల ఖాతాల్లో పెంచిన డీఏ జమ కానుంది. డీఏ బకాయిలను ప్రభుత్వం 33 వాయిదాల్లో చెల్లించనుంది. జూలై 2024 డీఏ బకాయిలను 27 వాయిదాల్లో చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. డీఏ బకాయిలను ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది.

# తీవ్రవాదానికి పాకిస్తాన్ మద్దతు..

### జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్ర కార్యకలాపాలపై మండిపడ్డ భారత్

**న్యూఢిల్లీ,అక్టోబర్,07:** ఉగ్రవాదానికి మద్దతుగా నిలుస్తున్న పాకిస్తాన్‌పై భారత్ మరోసారి మండిపడింది. తీవ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాక్ చర్యల్ని ఐక్యరాజ్యసమితి వేదికగా భారత్ ఖండించింది. ఐక్యరాజ్యసమితి సాధారణ సర్వసభ్య సమావేశాలు ఇటీవల అమెరికా, న్యూయార్క్‌లో ప్రారంభమైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 81వ ఐరాస సాధారణ అసెంబ్లీ ఆరవ కమిటీ సమావేశం జరుగుతోంది. దీనికి ఇండియా కూడా హాజరైంది. ఇండియా తరఫున బీజేపీ ఎంపీ, జాతీయ ప్రధాన కార్యదర్శి విప్లవ్ కుమార్ దేవ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పాకిస్తాన్ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. సరిహద్దు తీవ్రవాదాన్ని భారత్ ఖండిస్తోందని తెలిపారు. ఉగ్రవాదాన్ని పాకిస్తాన్ పెంచి పోషిస్తోందన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్ర కార్యకలాపాలకు పాకిస్తానే కారణం అన్నారు. సరిహద్దు వెంట ఉగ్రవాద సంస్థల కోసం ప్రత్యేక క్యాంపుల్ని పాకిస్తాన్ ఏర్పాటు చేస్తోందని వివరించారు. జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదానికి పాకిస్తాన్ మద్దతు ఇస్తుందని చెప్పారు. సరిహద్దు ఉగ్రవాదం నుంచి తనను తాను రక్షించుకునే హక్కు ఇండియాకు ఉందన్నారు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఉగ్రవాద దాడులకు జవాబుదారీ తనం కావాలని, అంతర్జాతీయంగా చట్టపరమైన విధానంఉండాలని దేవ్ సూచించారు. తీవ్రవాదానికి మద్దతు, ఆర్థిక వనరుల సమీకరణ, సంస్థలు, కుట్రలు, చొరబాట్లు వంటి వన్నింటిపైనా చర్యలు తీసుకోవాలని సూచించారు. పహల్గాంలో జరిగిన దాడి సరిహద్దు తీవ్రవాదానికి నిదర్శనం అన్నారు. ఈ దాడిలో 26 మంది మరణించారని తెలిపారు. ఈఘటనకు పాకిస్తాన్‌కు చెందిన లష్కర్ ఏ తైబా సంస్థ బాధ్యత వహించినసంగతి తెలిసిందే. సరిహద్దు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశం పాకిస్తాన్ అని ఐరాస సభలో మరోసారి ఇండియా చాటిచెప్పింది.



## ఢిల్లీలో కుప్పకూలిన

# 5 అంతస్తుల భవనం, తీవ్ర ఆందోళన

న్యూఢిల్లీ: దేశ రాజధాని నగరం ఢిల్లీలో హాస్టల్ భవనం కుప్పకూలిన విషాదాన్ని ఇంకా మర్చిపోక ముందే మరో ఐదు అంతస్తుల భవనం కూలిపోవడం కలకలం రేపింది. ఈశాన్య ఢిల్లీలోని సీమాపురి ప్రాంతంలో బుధవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ భవనంలో పలువురు చిక్కుకునిఉండవచ్చనే ఆందోళనమరింత దిగ్భ్రాంతి రేపుతోంది. ఐదు అంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలడంతో జనం హాహాకారాలు, తీవ్ర గందరగోళం నెలకొంది మధ్యాహ్నం 3.30 గంటలకు భవనం కూలి పోయినట్లు ఢిల్లీ అగ్నిమాపక విభాగానికి (డీఎఫ్ఎస్) సమాచారం అందింది. దీంతో వెంటనే వారు అప్రమత్తమయ్యారు.

## నా లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు..

# వాటిని మెడల్స్ గా భావిస్తా: రాహుల్

**న్యూఢిల్లీ,అక్టోబర్,07:** నిన్న ఈసీ కార్యాలయం ముట్టడి నేపథ్యంతో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను తేలిగ్గా తీసుకున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేతరాహుల్ గాంధీ, తన లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్ని ఎఫ్ఐఆర్ లు నమోదు చేసుకున్నా తానేమీ వెనుకంజ వేయబోనని, ఆ కేసులను మెడల్స్ గా భావిస్తానని అన్నారు. సీఈసీ పదవికి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందేనిపునరుద్ఘాటిం చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో నేడు జన్‌పథ్‌లోని సాగర్ రత్న రెస్టారెంట్‌లో విపక్ష ఎంపీల భోజన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని, ‘ఓట్ల దొంగతనం’ అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా మాట్లాడు తూ.. ‘ఇది లంచ్ మాత్రమే కాదు, ఒక లాంచ్ కూడా కావచ్చు’ అని చమత్కరించారు. కాగా, మంవారం ‘ఓట్ల దొంగతనం’ జరిగిందంటూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిన్న విపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు నేతలు ఆకాశవాణి భవన్‌లోకి ప్రవేశించి సుమారు 8 గంటల పాటు బైఠాయించారు. అనుమతి లేకుండా భవనంలోకి ప్రవేశించినందుకు పోలీసులు వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌పై స్పందిస్తూ రాహుల్ గాంధీ, “నాపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయి. నా లక్ష్యం 100” అని తేలికగా వ్యాఖ్యానించారు. భోజన భేటీ అనంతరం, ఎంపీలందరూ జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు సిద్ధంగా ఉన్న బస్సుల్లో బయలుదేరారు. మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్, జ్ఞానేశ్ కుమార్ కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఈ పరిణామాల నేపథ్యంలో, పోలీసులు జంతర్ మంతర్, ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లే మార్గాల్లో భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు.



# మక్తల్‌లో ఇరిగేషన్ భవన నిర్మాణానికి మంత్రి భూమి పూజ

## -రూ.4 కోట్లతో ఆధునిక భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టిన మంత్రి వాకిటి శ్రీహరి--పాల్గన్న నారాయణపేట జిల్లా కలెక్టర్...





నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో రూ. 4 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న ఇరిగేషన్ శాఖ భవన నిర్మాణానికి రాష్ట్ర పశు సంవర్ధక,పాడి పరిశ్రమ అభివృద్ధి మత్స్య శాఖ క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, జిల్లా కలెక్టర్ ప్రియాంకతో కలిసి బుధవారం భూమి పూజ చేశారు.అధికారులతో కలిసి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించి నిర్మాణపు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖకు సంబంధించిన కార్యాలయాలు,సిబ్బంది విధుల నిర్వహణకు మెరుగైన వసతులు కల్పించేందుకు నూతన భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక సౌకర్యాలతో,నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.మక్తల్ పట్టణంలోని ఇరిగేషన్ శాఖకు చెందిన స్థలాల్లో గోదాముల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించినట్లు మంత్రి తెలిపారు.గోదాముల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంకకు సూచించారు.అదేవిధంగా మక్తల్ పట్టణంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి అవసరమైన మున్సిపల్ స్థలాన్ని కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి సూచించారు.మక్తల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు.సాగునీరు, రహదారులు,విద్యుత్ తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస,జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు ఏ.కాంత్ కుమార్,నీటి పారుదల శాఖ ఈఈ గోపాల చారీ,డీఈఈలు సురేష్, మహేశ్,శివుడు,వెంకట రమణ,శేఖర్,ఏ. ఈలు,వార్డు కౌన్సిలర్లు,తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ గురుకుల ప్రిన్సిపాల్‌పై సమగ్ర విచారణ జరిపించాలి

## - విచారణ పూర్తయ్యే వరకు ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి...

## - జిల్లా అడిషనల్ కలెక్టర్ కు ఎస్ఎఫ్ఐ వినతి...



నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయం సమీపంలో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు,పాఠశాల నిర్వహణలో జరుగుతున్నట్లు వస్తున్న ఆరోపణలు,అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)ఆధ్వర్యంలో బుధవారం నారాయణపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ కు ఓ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పవన్ కుమార్ మాట్లాడుతూ పాఠశాల ప్రిన్సిపాల్ తన విధులను సక్రమంగా నిర్వహించడం లేదని,సిబ్బంది,విద్యార్థుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నదా లేదా అనే అంశంపై కూడా సమగ్రంగా పరిశీలన చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా విద్యార్థుల అన్‌లైన్ హాజరు,హాజరు రిజిస్టర్ల నిర్వహణ, పాఠశాలకు వచ్చిన ఆహార పదార్థాల స్టాక్,వాటి వినియోగం,భోజన బిల్లులు తదితర రికార్డులను అధికారులు పూర్తిగా తనిఖీ చేయాలని కోరారు.ప్రిన్సిపాల్ పాఠశాలకు హాజరయ్యే సమయం,విధుల నిర్వహణకు సంబంధించిన రికార్డులను కూడా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.విద్యార్థులకు నాణ్యమైన భోజనం,సరైన వసతి,విద్యా సదుపాయాలు అందించడం అధికారుల బాధ్యత అని,విద్యార్థుల హక్కులకు ఎలాంటి నష్టం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై సమగ్ర విచారణ జరిపించాలి.విచారణ పూర్తయ్యే వరకు ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసి బాధ్యతల నుంచి తప్పించాలి.విద్యార్థుల ఆన్‌లైన్ హాజరు,హాజరు రిజిస్టర్లను పూర్తిగా తనిఖీ చేయాలి.పాఠశాలకు వచ్చిన ఆహార పదార్థాల స్టాక్, వినియోగం,భోజన బిల్లులను ఆడిట్ చేయాలి.స్థానిక విద్యార్థులు బయట నుంచి రావడం వల్ల గురుకుల విద్యార్థులకు కలుగుతున్న ఇబ్బందులపై విచారణ జరిపించాలి.విద్యార్థులకు నాణ్యమైన భోజనం,వసతి, విద్యా సదుపాయాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలి.విద్యార్థులతో అనుచితంగా వ్యవహరించినట్లు విచారణలో తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించి,పాఠశాల నిర్వహణలో పారదర్శకతను పాటించాలి.మైనార్టీ గురుకుల విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించి,ప్రిన్సిపాల్‌పై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి,విచారణ పూర్తయ్యే వరకు సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ నారాయణపేట జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.

# సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

## -కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఫర్ ఉమెన్ కళాశాలలో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం- సైబర్ మోసంలో డబ్బులు కోల్పోయిన వెంటనే 1930కు ఫోన్ చేయాలి: పోలీస్ కమిషనర్ వెల్లడి





నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 07 (డీకే చాటింపు): నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై ప్రజలు, ముఖ్యంగా విద్యార్థినులు అప్రమత్తంగా ఉండేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఫర్ ఉమెన్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యతిథులుగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య పాల్గొని విద్యార్థినులకు సైబర్ నేరాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న నేపథ్యంలో సైబర్ నేరాలు కూడా రోజురోజుకూ కొత్త రూపాల్లో జరుగుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారా అనేక మోసాలను నివారించవచ్చని తెలిపారు. సైబర్ నేరగాళ్లు ప్రజల అత్యాశ , భయం , అత్యవసర పరిస్థితులు , ఉద్యోగాల అవసరం వంటి అంశాలను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు.ప్రధానంగా ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ , డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్ , సోషల్ మీడియా ఫేక్ ప్రొఫైల్ ఫ్రాడ్ , డీప్‌ఫేక్ ఫ్రాడ్ , పార్ట్‌టైమ్ జాబ్ ఫ్రాడ్ , లోన్ ఫ్రాడ్ , ఆన్‌లైన్ షాపింగ్ ఫ్రాడ్ తదితర సైబర్ మోసాల తీరును విద్యార్థినులకు వివరించారు. సోషల్ మీడియా ఫేక్ ప్రొఫైల్ , డీప్‌ఫేక్ మోసాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తుల ఫొటోలు , వీడియోలు , పేర్లను దుర్వినియోగం చేసి నకిలీ ఖాతాలు సృష్టించడం , ూ× సాంకేతికతను ఉపయోగించి మార్ఫింగ్ / డీప్‌ఫేక్ వీడియోలు రూపొందించడం ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు.పార్ట్‌టైమ్ జాబ్ , లోన్ , ఆన్‌లైన్ షాపింగ్ పేరుతో జరిగే మోసాల పట్ల కూడా జాగ్రత్త వహించాలని తెలిపారు. తెలియని వ్యక్తులకు ర్యాలు ,ూ×చీలు , జఎఎలు , పాస్‌వర్డ్‌లు , బ్యాంక్ వివరాలు , వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని సూచించారు. డబ్బులు పోయిన వెంటనే 'గోల్డెన్ అవర్'లో 1930కు సమాచారం ఇవ్వాలి సైబర్ మోసంలో డబ్బులు కోల్పోయినట్లయితే బాధితులు భయపడకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని పోలీస్ కమిషనర్ సూచించారు. సైబర్ మోసం జరిగిన వెంటనే స్పందించే సమయం అత్యంత కీలకమని , ప్రారంభ దశలో ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ష్ట్రజూం://ఎఎఎవతీఎతీఅఎవ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా సైబర్ నేరంపై ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. సైబర్ నేరం జరిగినప్పుడు ఆలస్యం చేయకుండా బ్యాంకు/సంబంధిత ఆర్థిక సంస్థలకు కూడా సమాచారం అందించాలని తెలిపారు. విద్యార్థినులు తాము సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించడంతో పాటు , తమ కుటుంబ సభ్యులు , స్నేహితులు మరియు పరిచయస్తులకు కూడా సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని పోలీస్ కమిషనర్ గారు సూచించారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడంతో పాటు , సురక్షితమైన డిజిటల్ వినియోగం, వ్యక్తిగత సమాచార రక్షణ , ఆన్‌లైన్ లావాదేవీలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ సంబంధించి నటువంటి వాల్ పోస్టర్లను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసిపి ప్రకాష్ యాదవ్ కాకతీయ ఇన్స్టిట్యూట్స్ చైర్మన్ రజనీకాంత్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ సైబర్ క్రైమ్ సిఐ శ్రీముఖి పాష మాక్లూర్ ఎస్సై అనిల్ రెడ్డి మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితం, సుపరిపాలన ఒక చారిత్రాత్మక ప్రస్థానం:

## బీజేపీ సీనియర్ నాయకులు చింతల సురేందర్ యాదవ్






ఎల్బీనగర్, (డీకే చాటింపు) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవ ద్వారా దేశసేవ" అనే స్ఫూర్తితో ప్రజా జీవితంలో 25 ఏళ్ల అచంచలమైన ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు దిల్‌సుఖ్‌నగర్‌లోని భాగ్యశ్రీ కన్వెన్షన్ హాల్‌లో వికసిత్ భారత్ సంకల్ప సభ' మరియు 'సేవా జ్యోతి యాత్ర' కార్యక్రమాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భాగ్యశ్రీ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి బీజేపీ సీనియర్ నాయకులు చింతల సురేందర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నరేంద్ర మోదీ గారి 25 ఏళ్ల ప్రజా జీవితం కేవలం పదవుల ప్రస్థానం కాదని, కోట్లాది భారతీయుల నమ్మకాన్ని గెలుచుకున్న నిరంతర సేవా యజ్ఞమని అన్నారు. ప్రజా సంక్షేమం, దేశ అభివృద్ధి, సుపరిపాలన, జాతీయ ప్రయోజనాలే లక్ష్యంగా మోదీ సాగించిన 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానం భారతదేశ చరిత్రలో ఒక చారిత్రాత్మక అధ్యాయంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమైన ఆయన ప్రజా సేవా ప్రస్థానం, అనంతరం భారత ప్రధానమంత్రిగా దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్న నాయకత్వం వరకు కొనసాగడం ఆయన అంకితభావానికి, దేశం పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు.వికసిత్ భారత్ లక్ష్య సాధనలో, దేశంలోని ప్రతి పౌరుడికి సంక్షేమ ఫలాలు అందించడంలో, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో మరియు సేవా భావంతో ముందుకు సాగడంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు అందిస్తున్న మార్గదర్శకత్వం ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. పేదలు, రైతులు, మహిళలు, యువత, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు సహా సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశ ప్రగతికి బలమైన పునాదులు వేస్తున్నాయని అన్నారు. 'సబ్‌కా సాథ్ -- సబ్‌కా వికాస్ -- సబ్‌కా విశ్వాస్ -- సబ్‌కా ప్రయాస్' అనే స్ఫూర్తితో ప్రతి వర్గాన్ని అభివృద్ధి పథంలో భాగస్వామ్యం చేస్తూ వికసిత్ భారత్ నిర్మాణం వైపు దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి 25 ఏళ్ల ప్రజా జీవితం బీజేపీ కార్యకర్తలకు, యువతకు, ప్రజాసేవ చేయాలనుకునే ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశ ప్రగతి కోసం అంకితభావంతో పనిచేస్తున్న ఈ మహాయజ్ఞంలో భాగస్వాములు కావడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. వికసిత్ భారత్ నిర్మాణం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి భారతీయుడి భాగస్వామ్యంతోనే ఈ మహాసంకల్పం సాకారం అవుతుందని అన్నారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. అనంతరం 'సేవా జ్యోతి యాత్ర'లోలి భాగంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి భాగ్యశ్రీ కన్వెన్షన్ హాల్ నుంచి శివాజీ చౌరస్తా వరకు ఘనంగా ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్న ఈ ర్యాలీ ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ర్యాలీ సందర్భంగా భారత్ మాతాకీ జై, వందేమాతరం, జై బీజేపీ, జయహో నరేంద్ర మోదీ నినాదాలతో దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతం మార్మోగింది. మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానాన్ని కొనియాడుతూ, వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాయకులు, కార్యకర్తలు సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జి ఎస్ ఐ డివిజన్ బిజెపి అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి బీజేపీ సీనియర్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ మోర్చాల ప్రతినిధులు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# మళ్లీ గుడ్ మార్నింగ్ అంటున్న కేతిరెడ్డి



అనంతపురం, : ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి.. గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించారు. ఎన్నికల్లో ఓటమి అనంతరం ఈ కార్యక్రమానికి కేతిరెడ్డి దూరంగా ఉన్నారు. అయితే సోమవారం ఉదయం.. పట్టణంలోని చేనేత ఇళ్ల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల లబ్ధి అందుతోందా లేదా అనేది వాకబు చేశారు. త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. ప్రజల్లోకి వెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని మళ్లీ ప్రారంభించారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి .. తెలుగు రాజకీయాలపై అవగాహన ఉన్నవారికి పరిచయం అక్కర్లేని పేరు. గుడ్ మార్నింగ్ ధర్మవరం అంటే సోషల్ మీడియా యూజర్లకు కూడా చిరపరిచితమే. ఉదయాన్నే ప్రతి ఇంటి గడపనూ పలకరిస్తూ.. వారి సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి గతంలో గుడ్ మార్నింగ్ ధర్మవరం పేరుతో కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కేతిరెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమం.. సోషల్ మీడియాలో సూపర్ హిట్ అయ్యింది. పొరుగు రాష్ట్రాలలోనూ.. ఆయన ఫాలోయింగ్ పెరిగింది. అయితే 2024 ఎన్నికల్లో ఊహించని రీతిలో ఓటమి పాలయ్యారు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి. ఆ తర్వాత గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించలేదు.అయితే ఇన్ని రోజుల తర్వాత ఇప్పుడు మళ్లీ గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమాన్ని కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తిరిగి ప్రారంభించారు. ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన నేతన్న సేవలో పథకం కింద రూ.25000 ఆర్థిక సహాయం అందిందా లేదా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేతన్న సేవలో డబ్బులు చేనేతల హక్కు అని.. రాకుంటే ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికలు వస్తున్నాయనే కారణంతోనే ప్రభుత్వం పింఛన్లు, నేతన్న సేవలో పథకం అంటూ హడావిడి చేస్తోందని కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి విమర్శించారు.అయితే ఎన్నికల్లో ఓటమి తర్వాత గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమానికి కేతిరెడ్డి దూరమయ్యారు. ఆ తర్వాత వైసీపీ తరుఫున ప్రభుత్వ తీరును ఎండగడుతూ అనేక నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టారు. అయితే ఇప్పుడు మళ్లీ గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమం ప్రారంభించడానికి.. స్థానిక సంస్థల ఎన్నికలు కారణం కావొచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# కాంగ్రెస్ కు దగ్గరవుతున్న జగన్



కడప, : వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి క్రమంగా కాంగ్రెస్ అధిష్టానానికి దగ్గరవుతున్నారనే ప్రచారం ఢిల్లీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో వైఎస్ జగన్ సుదీర్ఘంగా చర్చలు జరిపారన్న కథనాలు రావడం, ఈ భేటీ వార్తలను అటు కాంగ్రెస్ కానీ, ఇటు వైఎస్ఆర్‌సీపీ కానీ స్పష్టంగా ఖండించకపోవడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. కేంద్రంలోని అధికార పక్షానికి అనుకూలంగా ఉంటూ వస్తున్న జగన్, సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత తన జాతీయ రాజకీయ వ్యూహాన్ని పూర్తిగా మార్చుకుంటున్నారనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ ప్రచారానికి బలాన్ని చేకూరుస్తూ.. కాంగ్రెస్ అనుకూల సెఫాలజిస్టులు , విశ్లేషకులు జగన్-కాంగ్రెస్ కలయిక పై కొత్త లాజిక్కులు తెరపైకి తెస్తున్నారు. గత ఎన్నికల్లో ఏపీలో కాంగ్రెస్ పార్టీకి గణనీయమైన ఓటు బ్యాంక్ రాకపోయినా, ఓట్ల చీలిక వైఎస్ఆర్‌సీపీ విజయావకాశాలను కొంతవరకు దెబ్బతీసిందనే అంచనా ఉంది. భవిష్యత్తులో వైఎస్ఆర్‌సీపీ, కాంగ్రెస్ ఒకే గొడుగు కిందకి వచ్చినా లేదా ఇండియా కూటమి భాగస్వామిగా వైసీపీ చేరినా.. ఏపీలో కూటమికి గట్టి పోటీ ఇవ్వవచ్చని, కేంద్రంలోనూ బీజేపీకి వ్యతిరేక పక్షంలోకి మారేందుకు జగన్‌కు రోడ్‌మ్యాప్ సిద్ధమవుతోందని విశ్లేషిస్తున్నారు. అయితే, ఈ రాజకీయ పునరేకీకరణ వెనుక అతిపెద్ద అడ్డంకి వైఎస్ షర్మిల పాత్ర. ప్రస్తుతం ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్న షర్మిల.. వైఎస్ జగన్‌పై, ఆయన పాలనా శైలిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతు న్నారు. ఆస్తి వివాదాలు, కుటుంబ విభేదాలు ఉన్నాయి. హైకమాండ్ ఆదేశిస్తే ఢిల్లీ పెద్దల సమక్షంలో కుటుంబ కలహాలను పక్కనబెట్టి ఒక అవగాహనకు వచ్చే అవకాశాలను కూడా కొట్టిపారేయలేము.వైఎస్ జగన్ ఈ దిశగా అడుగులు వేయడానికి మరో బలమైన కారణం ? కేంద్రంలోని అధికార పక్షం నుంచి గతంలో లభించినంత పొలిటికల్ రక్షణ ఇప్పుడు లభించడం లేదన్న భావన. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నమోదు అవుతున్న కేసులు, ఈడీ, సీబీఐ విచారణల వేగం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
గురువారం,అక్టోబర్,8, 2026

## ప్రభుత్వ విద్య వికసించేనా..?

విద్య సామాన్యుడికి ఒక ఆశయం, బతుకు బాగు చేసే ఒక సాధనం. మధ్య తరగతికి ఒక ఆకాంక్ష, అందీఅందని ద్రాక్ష. ధనవంతులకు మరింత ధనం సంపాదించడానికి ఉపయోగపడే ఆయుధం. ప్రభుత్వ రంగంలో ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా నిష్ణాతులైన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధిస్తుంటే విద్యార్థులు ఎంతో శ్రద్ధగా నేర్చుకొని ఉన్నత స్థాయికి ఎదిగేవారు. ప్రైవేటు రంగంలో అతికొద్ది పాఠశాలలు సేవాభావంతో పనిచేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దేవి. కొద్దిమంది విద్యాభిమానులు లాభాపేక్ష లేకుండా ప్రైవేటు పాఠశాలలను నడపగా అతికొద్ది మొత్తంలో ఫీజు వసూలు చేస్తూ క్రైస్తవ మిషనరీ సంస్థలు పాఠశాలలను మంచి ప్రమాణాలతో నడిపాయి. ఇది 1990 వరకు పరిస్థితి. కాలక్రమేణా ప్రైవేటు పాఠశాలల సంఖ్య పెరిగింది. ఇంకా కార్పొరేట్ సంస్థలు పెద్ద సంఖ్యలో ఒకేసారి అనేక ప్రదేశాలలో పాఠశాలలు తెరిచి విద్యను వ్యాపారమయం చేశాయి. అదే క్రమంలో ప్రభుత్వం నెమ్మదిగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించకపోవడం కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించడం చేస్తూ విద్యకు చాలా తక్కువ బడ్జెట్ కేటాయింపులు చేయడంతో అవి తమ ప్రభను కోల్పోయాయి. ప్రభుత్వం నెమ్మదిగా తన బాధ్యత నుండి దూరం పోయింది. ప్రభుత్వ పాఠశాలల భవనాలు కూడా శిథిలావస్థకు చేరుకోగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు పెద్దపెద్ద భవనాల్లో నడుస్తుంటే తల్లిదండ్రుల ఆలోచనల్లో కూడా మార్పు వచ్చింది. విద్య క్రమంగా ప్రైవేట్ కార్పొరేట్ చేతుల్లోకి పోయింది. దానికి తోడు ప్రైవేట్ కార్పొరేట్ వ్యవస్థలు ఆంగ్ల మాధ్యమంలో నడుస్తుంటే ప్రభుత్వ బడులను తెలుగు మీడియంలోనే బోధన కొనసాగించడం అవి వెనుకబడి పోవడానికి మరో కారణమైంది. మౌలిక వసతుల కల్పన ముఖ్యంగా భవనాలు, మంచినీరు, టాయిలెట్స్ లేకపోవడం ఇవన్నీ కర్ణుడు చావుకు సవాలక్ష కారణాలు లాగా ప్రభుత్వ స్కూళ్లకు నెమ్మదిగా మరణ శాసనం రాశాయి. ఈ మధ్య వచ్చిన ఆకునూరి మురళి కమిటీ నివేదిక ప్రకారం రాష్ట్రంలో 30 రకాల బడులు నడుస్తున్నాయి. ప్రభుత్వ రంగంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, మున్సిపల్, గిరిజన వికాస కేంద్రాలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, మోడల్ స్కూల్, పబ్లిక్ స్కూల్ రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోనూ కస్తూర్భా పాఠశాలలు కేంద్రీయ నవోదయ పాఠశాలలు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనూ నడవడం గమనార్హం. ఇక ప్రైవేట్ కార్పొరేట్ రంగాలలో టెక్నో, ఈ-టెక్నో, ఒలింపియాడ్, వరల్డ్, ఇంటర్నేషనల్, ఫౌండేషన్, డిజిటల్, పబ్లిక్ స్కూల్స్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, గ్రామర్ స్కూల్స్ వంటి రకరకాల ఆకర్షణీయమైన పేర్లతో పాఠశాలను నడిపిస్తూ తల్లిదండ్రులను, వారిపిల్లలను ఆకర్షిస్తున్నాయి. ఇన్ని రకాల పాఠశాలల్లోనూ కేవలం ఎస్సిఇఆర్టి, సిబిఎస్ఇ, ఐసిఎస్ఇ, ఐబి సిలబస్ మాత్రమే బోధిస్తారు. ప్రైవేట్ కార్పొరేట్ రంగాలలోని పాఠశాలలు శరవేగంతో దూసుకొని దోచుకుంటూ పోతుంటే ప్రభుత్వం ఇంకా మానమేషాలు లెక్కిస్తూ ఆంగ్ల మాధ్యమం అమలు చేయడానికి సంకోచిస్తున్నది. కనీసం ఆరవ తరగతి నుండైనా ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టవచ్చు. అదే విధంగా కంప్యూటర్ స్కిల్స్ డిజిటల్ లిటరసీ వంటి నైపుణ్యాలు నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. లేదంటే వారు రానున్న కాలంలో ఇతరులతో పోటీ పడలేరు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని వెయ్యికి పైగా గురుకులాలలో ఆంగ్ల మాధ్యమంలోనే బోధన జరుగుతున్నది. కంప్యూటర్ విద్య కూడా నేర్పుతున్నారు. కానీ వాటిలో కేవలం ఐదు లక్షల మందికి మాత్రమే విద్య అందుబాటులో ఉన్నది. పైగా నేటి ప్రభుత్వం గురుకులాలను నిర్లక్ష్యం చేయడంతో వాటికి భవనాలు లేక ఆహార నాణ్యత కొరవడి, ఎలుక కాట్లు, పాము కాట్లతో విద్యార్థుల మరణాలతో వాటి పేరు ప్రతిష్టలు దిగజారాయి. ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాల పేరుతో ప్రతి నియోజకవర్గానికి ఒకటి మంజూరు చేసి రెండు వందల రూపాయలు కోట్లతో నిర్మాణాలు చేపట్టింది ఆ ప్రాజెక్టు పూర్తయి అది విద్యార్థులకు అందుబాటులోనికి వచ్చేనో రాదో ఎవరికీ తెలియదు. ఒకవేళ మళ్లీ ప్రభుత్వాలు మారితే వాటి భవిష్యత్తు ప్రశ్నార్థకమే. మరోపక్క ఆకునూరి వారి సిఫార్సుల ప్రకారం మండలానికి మూడు లేదా నాలుగు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పేరుతో ప్రస్తుతం ఒక వంద స్కూళ్లకు శ్రీకారం చుట్టింది. వాటి నిర్మాణం పూర్తయి అవి ఎప్పటికీ ఉపయోగంలోనికి వచ్చేను? ప్రతి స్కూల్ 1500 మందికి నర్సరీ నుండి ఇంటర్మీడియట్ వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధనతో పాటుగా కంప్యూటర్ నైపుణ్యాలు, క్రీడలకు ప్రాధాన్యత ఇంకా రవాణా సౌకర్యం కూడా కల్పించే ఆలోచనతో ఉన్నది ఈ ప్రభుత్వం.

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన
డీకే చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సారధ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి :
సెల్ : 9603754136 - 7386287837

# రాహుల్ అరెస్ట్ ప్రజా స్వామ్యనికి గొడ్డలి పెట్టు

### టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



డీకే చాటింపు ప్రతినిధి,(ఢిల్లీ): దేశంలో ఓట్ల తొలగింపు, సర్ ప్రక్రియ లో జరిగిన అక్రమాలపై ప్రశ్నిస్తే ఒక లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమి నాయకులను అరెస్ట్ చేయడం ప్రజా స్వామ్య విధానాలకు గొడ్డలిపెట్టు లాంటిదని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఆయన మంగళవారం ఢిల్లీలో మీడియా తో మాట్లాడారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో ప్రజా స్వామ్య యుతంగా, శాంతి యుతంగా ఈ.సి ముందు దీక్ష చేసేందుకు వెళ్తుంటే పోలీసులు అడ్డుకోవడం చాలా దారుణం అని అన్నారు.ఇండియా కూటమి నాయకులు దేశంలో ఒక అతిపెద్ద సమస్యపై పోరాటం చేస్తుంటే నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇలా అడ్డుకోవడం నియంత పాలనకు పరాకాష్ట అన్నారు. దేశంలోని ఇండియా కూటమి ఎంపీలు రాహుల్ గాంధి, ప్రియాంక గాంధీ పాంటీ కాంగ్రెస్ అగ్రనేతలు పాల్గొన్న అంశంలో కేంద్రం ప్రవర్తించిన తీరు చాలా దుర్మార్గమని ఇది ప్రతి ప్రజాస్వామ్య వాది ఖండించాలని అన్నారు. దేశంలో అడ్డగోలుగా ఓట్ల చోరీ చేసి అక్రమంగా అధికారంలోకి వస్తున్న బీజేపీ ఇలా ఇండియా కూటమి నేతలను అడ్డుకోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

# గోల్డెన్ అవర్‌లో సమర్థవంతంగా స్పందించి రోడ్డు ప్రమాద బాధితుల ప్రాణాలను కాపాడాలి

### పోలీసులు , ఫైర్ సర్వీస్ , 108 , అంబులెన్స్ , ఆసుపత్రుల మధ్య సమన్వయం అత్యంత కీలకం పోలీస్ కమీషనర్ వెల్లడి




నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 07 (డీకే చాటింపు): నిజామాబాదు పోలీస్ శాఖ సౌజన్యంతో సేవ్ లైఫ్ ఫౌండేషన్ మరియు వెర్టీస్ ఫౌండేషన్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో అవగాహన మరియు సమన్వయ కార్యక్రమం బుధవారం పోలీస్ కమాండ్ కంట్రోల్ హాల్ యందు నిర్వహించడం జరిగింది.నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర వైద్య సహాయం అందించి , గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడే విధంగా అత్యవసర సేవల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, అన్నారు.సేవ్ లైఫ్ ఫౌండేషన్ మరియు వెర్టీస్ ఫౌండేషన్ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల జరిగిన సమయంలో చేపట్టాల్సిన తక్షణ చర్యలు , బాధితులకు అందించాల్సిన ప్రాథమిక సహాయం , ప్రమాద స్థలం నుంచి ఆసుపత్రికి తరలించే ప్రక్రియ , వివిధ శాఖల మధ్య సమన్వయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే ప్రతి నిమిషం ఎంతో విలువైనదని తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి సకాలంలో ప్రాథమిక వైద్యం అందించడం , వెంటనే అంబులెన్స్‌ను సమకూర్చడం , అవసరమైతే ఫైర్ సర్వీస్ సహాయంతో బాధితుడిని సురక్షితంగా బయటకు తీసుకురావడం , ఎలాంటి ఆలస్యం లేకుండా ఆసుపత్రికి తరలించడం వంటి చర్యలు సమన్వయం తో జరగాలని సూచించారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించడం , ప్రమాదంలో చిక్కుకున్న వారికి సహాయం చేయడం , 108 మరియు ఇతర అంబులెన్స్ సేవలకు సమాచారం అందించడం వంటి చర్యలను వేగంగా చేపట్టాలని అన్నారు. అదేవిధంగా , తీవ్ర ప్రమాదాల్లో వాహనాల్లో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసుకురావడానికి ఫైర్ సర్వీస్ సిబ్బంది తక్షణమే స్పందించాలని , 108 అంబులెన్స్ సిబ్బంది అత్యవసర వైద్య సేవలు అందిస్తూ బాధితులను త్వరితగతిన ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఆసుపత్రులయాజమాన్యాలు మరియు వైద్య సిబ్బంది కూడా రోడ్డు ప్రమాద బాధితులకు అత్యవసర చికిత్స అందించేందుకు అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని పోలీస్ కమిషనర్ గారు పేర్కొన్నారు. ప్రమాద బాధితుడు ఆసుపత్రికి చేరుకునే సమయాన్ని తగ్గించేందుకు పోలీస్ శాఖ--108--ఫైర్ సర్వీస్--అంబులెన్స్--ఆసుపత్రుల మధ్య నిరంతర సమన్వయం ఉండాలని సూచించారు. “ప్రతి నిమిషం ఒక ప్రాణాన్ని కాపాడగలదు” రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి గోల్డెన్ అవర్‌లో సరైన వైద్య సహాయం అందితే ప్రాణాపాయ పరిస్థితి నుంచి బయటపడే అవకాశం ఉంటుందని, అందువల్ల ప్రమాదం జరిగిన వెంటనే స్పందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదా ఆలస్యం ఉండకూడదని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. ప్రమాద స్థలానికి అంబులెన్స్ చేరుకునే సమయం, బాధితుడిని వాహనం నుంచి బయటకు తీసే సమయం , ఆసుపత్రికి తరలించే సమయం వంటి ప్రతి దశను సమీక్షించి , అవసరమైన చోట మరింత మెరుగైన సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం తగ్గించేందుకు “త్వరిత స్పందన -- సకాలంలో వైద్యం -- సమన్వయంతో తరలింపు -- ప్రాణ రక్షణ” అనే విధానంతో అన్ని అత్యవసర సేవల విభాగాలు సమిష్టిగా పనిచేయాలని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాద బాధితులకు అత్యవసర సమయంలో వేగంగా సహాయం అందించడంతో పాటు , గోల్డెన్ అవర్‌ను సద్వినియోగం చేసుకుని విలువైన ప్రాణాలను కాపాడే విధంగా నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని అన్ని సంబంధిత విభాగాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాదు ఆదనపు డీసీపీ (అడ్మిన్ ) ఎన్. శుభం ప్రకాష్ , నిజామాబాదు ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ , సేవ్ లైఫ్ ఫౌండేషన్ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ మహేష్ , సీఈవో పూష్ తివారి , మేనేజర్ నూర్ కేథర్ పాల్ , సిఓపి ఇలియానా , అసోసియేటెడ్ డైరెక్టర్ మల్లికార్జున్ , సి ఓ సి డాక్టర్ పుష్పందర్ కౌశిక్ , డిటిఓ రమేష్ రాథోడ్ , డి. ఎఫ్ ఓ పరమేశ్వర్ , 108 డైరెక్టర్ డాక్టర్ స్వరాజ్ , డి ఎం అండ్ హెచ్ ఓ ఆఫీసుకు సంబందించిన డాక్టర్లు సయ్యద్ అజ్మల్ డాక్టర్ సందీప్ , ఐ - రాడ్ మేనేజర్ శ్రీ వర్ష మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లి బిడ్డ మృతి ఘటనపై బాధ్యులపై చర్యలు ఉంటాయా ?

### -- ప్రతిభ నర్సింగ్ హోమ్‌లో -- రెండు రోజుల తర్వాత ఆసుపత్రి తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి... ఫలితం ఏమిటి..?-- కంటి తుడుపు చర్యలతోనే సరిపెడతారా..?




మంచిర్యాల(డీకే చాటింపు): జిల్లా కేంద్రంలో తల్లి--బిడ్డ మృతి ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గుడిపేటకు చెందిన గర్భిణి మహిళ ప్రసవ సమయంలో మృతిచెందడం, శిశువు మృతిగా జన్మించడం నేపథ్యంలో కుటుంబ సభ్యులు వైద్య నిర్లక్ష్యాన్ని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. ఘటనపై అధికారులు విచారణకు హామీ ఇచ్చినట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే ప్రజల్లో ఇప్పుడు ఒకే ప్రశ్న వినిపిస్తోంది... ఈ ఘటనలో నిజంగా బాధ్యులపై చర్యలు ఉంటాయా..? లేక గతంలో జరిగిన ఘటనల మాదిరిగానే ఫైల్ మూసేస్తారా..?” తల్లి--బిడ్డ మరణించి రెండు రోజుల తర్వాత జిల్లా వైద్యాధికారి డా. నరేందర్ ఆసుపత్రిని సందర్శించడం చర్చకు దారితీసింది. ఘటన జరిగిన వెంటనే ఎందుకు స్పందించలేదనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. గత ఘటనల్లో చర్యలు ఎక్కడ..?మంచిర్యాల జిల్లాలో గతంలో కూడా ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స, ప్రసవాలు, వైద్య సేవలపై వివాదాలు, ఆరోపణలు వెలువడ్డ సందర్భాలు ఉన్నాయి. కానీ వాటిలో ఎన్ని కేసుల్లో స్పష్టమైన చర్యలు తీసుకున్నారు..? ఎన్ని కేసుల్లో లైసెన్సులు రద్దు చేశారు..? ఎన్ని కేసుల్లో బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయి..? అనే ప్రశ్నలకు ప్రజలకు స్పష్టమైన సమాధానాలు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. ఫీజుల దోపిడి ఆరోపణలపై ఏమవుతుంది..? జిల్లాలోని కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులపై అధిక బిల్లులు, అనవసర పరీక్షలు, అత్యవసర పరిస్థితులను ఆసరాగా చేసుకుని ఆర్థిక భారం మోపుతున్నారనే ఆరోపణలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. ఇలాంటి ఫిర్యాదులపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నివేదికలను బహిర్గతం చేస్తుందా..? లేక తనిఖీలతోనే సరిపెడుతుందా..? అన్నది చూడాల్సి ఉంది. ప్రజల డిమాండ్ ఇదే... తల్లి--బిడ్డ మృతి ఘటనపై పారదర్శక విచారణ. పోస్టుమార్టం, వైద్య రికార్డులపై స్వతంత్ర పరిశీలన.తప్పిదం తేలితే బాధ్యులపై కఠిన చర్యలు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులపై సమగ్ర తనిఖీలు ఫీజుల దోపిడి, వైద్య నిర్లక్ష్యంపై ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు.ప్రస్తుతం ప్రజలు ఎదురుచూస్తున్నది ఒకటే... ఈసారి నిజంగా చర్యలు ఉంటాయా..? లేక మరోసారి కంటి తుడుపు తనిఖీలతోనే కథ ముగుస్తుందా..?”

# ఎండిపోయిన వరి పంటకు నిప్పు పెట్టిన రైతు



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 07(డీకే చాటింపు): నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలోని పైడిమల్ శివారులో ఎండిపోయిన వరి పంటకు రైతు నిప్పు పెట్టాడు. నిజాంసాగర్ ప్రాజెక్ట్ కాలువ కింద కష్టపడి 5 ఎకరాల్లో వరి సాగు చేయగా చేతికి వచ్చిన పంట నీళ్లు లేక ఎండిపోవడంతో తట్టుకోలేక పంటకు నిప్పిపెట్టినట్లు రైతు కంది రాములు తెలిపారు. ఎకరానికి 20వేలచొప్పున లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టిన పంట చేతికి రాకపోవడంతో తీవ్ర వేదనకు గురైన రైతు పంటకు నిప్పు పెట్టాడు. మరో రెండు తడులకు నీళ్లు వస్తే పంట చేతికి వచ్చేదని, వర్షాలు కురియక భూగర్భ జలాలు అడుగంటిపోయి బోరు ఎత్తివేయడంతో పంట ఎండిపోయినట్లు రైతు వెల్లడించారు. పెట్టుబడి తో పాటు ఈ ఏడాది పంట నష్టపోవడంతో లక్షల రూపాయల వరకు ఆర్థిక భారం పైబడినట్లు రైతు ఆవేదన వెళ్లగక్కాడు. పెట్టుబడికి అప్పు తీసుకువచ్చి పంట సాగు చేశానని గింజ కూడా చేతికి రాకపోవడంతో అప్పుల పాలైనట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని లేకపోతే ఆర్థిక ఇబ్బందులు తాళలేక వలసలు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుందని రైతు రాములు ఆవేదన వ్యక్తం చేశారు.

# విరబూసిన బ్రహ్మ కమలం...



బెల్లంపల్లి (డీకే చాటింపు )పట్టణం లో అరుదైన బ్రహ్మ కమలం పువ్వు విరబూసింది. వివరాల్లోకి వెళ్తే. బెల్లంపల్లి పట్టణం లోని ఇందిరమ్మ కాలనీ లో నివాసం వుండే విశ్రాంత సింగరేణి కార్మికుడు బూసి సదానందం ఇంట్లో అరుదైన బ్రహ్మ కమలం పువ్వు విరబూసింది. దింతో చుట్టూ పక్కన వుండే వారు బ్రహ్మ కమలం పువ్వు ను చూడటానికి వచ్చారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ బ్రహ్మ కమలం పువ్వు ను కింగ్ అఫ్ హిమాలయ ఫ్లవర్ గా పేర్కొంటారని, బ్రహ్మ దేవుడు బ్రహ్మ కమలం పై ఆసినుడైఉంటాడని, కేదారనాథ్ శివునికి ప్రత్యేకంగా ఈ పువ్వు ను సమర్పిస్తారని అన్నారు. కొన్ని సంవత్సరాలుగా బ్రహ్మ కమలం పువ్వు మా ఇంట్లో పూయడం ఆనందంగా ఉందని అన్నారు

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి: నగదు,సెల్‌ఫోన్లు,బైక్‌లు స్వాధీనం...

జనగామ అక్టోబర్ 06 డీకే చాటింపు జిల్లా ప్రతినిధి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జనగామ జిల్లా కొడకండ్ల మండల పోలీసులు నిర్వహించిన పెట్రోలింగ్‌లో భాగంగా గ్రామ శివారు ప్రాంతంలో అక్రమంగా పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. గ్రామ శివారులో కొందరు వ్యక్తులు డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం అందడంతో పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని దాడి నిర్వహించారు.ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి రూ.3,550 నగదు,7 స్మార్ట్‌ఫోన్లు,7 మోటార్‌సైకిళ్లు,104 పేక ముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అనంతరం నిందితులను, స్వాధీనం చేసుకున్న సామగ్రిని పోలీస్ స్టేషన్‌కు తరలించి చట్టపరమైన తదుపరి చర్యలు చేపట్టారు.గ్రామాల్లో అక్రమ పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై చింత రాజు హెచ్చరించారు. ప్రజలు అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

# సాంకేతిక సమస్య వందలాది విమానాలు రద్దు



సాంకేతిక సమస్య కారణంగా బ్రిటన్‌కు రాకపోకలు సాగించే వందలాది విమానాలు రద్దయ్యాయి. దేశంలోకి రాకపోకలు జరిపే వెయ్యికి పైగా విమానాలను రద్దు చేశారు. మంగళవారం కూడా బ్రిటన్ విమానాశ్రయాలకు రాకపోకలు సాగించే 1,300 విమానాలను రద్దు చేశారు. ఉదయం మరో 279 విమానాలు రద్దయ్యాయి. హీత్రో, గాట్విక్ సహా పలు విమానాశ్రయాలలో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిన నాలుగు గంటల తర్వాత ఇంజినీర్లు రంగంలోకి దిగి సమస్యను గుర్తించి పరిష్కరించారని జాతీయ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సర్వీస్ (నాట్స్) తెలిపింది. అయితే విమానాశ్రయాలలో పరిస్థితులు సాధారణ స్థితికి చేరడానికి ఎంత సమయం పడుతుందో తెలియడం లేదు.

## పత్తి రైతుల నిలువు దోపిడిపై

# అధికార పార్టీ నేత ఆవేదన..!

**-అధికారుల ఆజమాయిషీ కరువు... -పత్తి రైతుల నిలువు దోపిడీ...!? -పత్తి మిల్లు యజమానులు సిండికేట్...!? -రైతుల నిలువు దోపిడీ...!? -జిల్లా యంత్రాంగం స్పందించాలి... -నారాయణపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్... -"డీకే చాటింపు"ప్రత్యేక కథనం...!**












నారాయణపేట,(డీకే చాటింపు):

నారాయణపేటలో జిల్లాలో జరుగుతున్న పత్తి విక్రయాలపై అధికారుల ఆజమాయిషీ కరువు–పత్తి రైతుల నిలువు దోపిడీ– మార్కెట్ అధికారుల పర్యవేక్షణ లోపంతో మిల్లుల సిండికేట్ దందా.!? ఇది ఎవరో ప్రతిపక్ష నేత అన్నమాటలు కాదు సుమా..! సాక్షాత్తు అధికార పార్టీ నేత,నారాయణపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్ నోటి నుంచి వచ్చిన ఆవేదన మాటలు..!!

**పత్తి రైతుల కోసం...**

నారాయణపేట జిల్లాలో పత్తి రైతులను ఆదుకోవాల్సిన సంబంధిత యంత్రాంగం పూర్తిగా నిర్లక్ష్యపు ధోరణి వల్ల జిల్లాలో ఆజమాయిషీ కరువు (మార్కెట్ అధికారి పర్యవేక్షణ)లేకపోవడంతో పత్తి మిల్లు యజమానులు సిండికేట్ గా మారి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. బహిరంగంగా రైతులను పత్తి మిల్లు యజమానులు దోచుకుంటున్న ఇంతవరకు సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో తప్పని పరిస్థితిని ఓ అధికార పార్టీ నేతగా తాము ముందుకు రావాల్సి వచ్చిందని నారాయణపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాటల్లోనే...

**కనీస మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు...**

ప్రభుత్వం ప్రకటించిన పత్తి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.8,667 ఉండగా,నారాయణపేట జిల్లాలోని కాటన్ మిల్లు యజమానులు రూ.7,500 నుంచి రూ.8,000 మధ్యలో మాత్రమే కొనుగోలు చేస్తున్నారు.క్వింటాలుకు దాదాపు రూ.1000 వరకు రైతులు నష్టపోతున్నారు.

**కర్ణాటక రాష్ట్రంలో...**

నారాయణపేట జిల్లా కేంద్రానికి పక్కనున్న కర్ణాటక రాష్ట్రంలో పత్తి క్వింటాలు ధర రూ. 9,600 వరకు పలుకుతున్నప్పటికీ,రవాణా ఖర్చులకు,మోసాలకు భయపడి రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో నారాయణపేట మార్కెట్ లోనే తక్కువ ధరకు పత్తిని అమ్ముకుంటున్నారు.ఈ విషయంలో ఇంతవరకు అధికార యంత్రం స్పందించకపోవడం విచారించదగ్గ విషయం.

**తొలకరి వర్షాలకే సాగు, దిగుబడిపై తీవ్ర ప్రభావం**

ఈసారి తొలకరి వర్షాలు ముందుగా పడటంతో రైతులు ముందుగానే పత్తి విత్తనాలు విత్తారు.దసరా, దీపావళి నాటికి పత్తి ఏరే పని(పికింగ్)దాదాపు పూర్తయ్యే పరిస్థితి ఉంది. ఎండ తీవ్రత పెరగడం, గడిచిన నాలుగు నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా ఏకకాలంలో భారీ వర్షాలు లేకపోవడం, అక్కడక్కడా అడపాదడపా వర్షాలు మాత్రమే పడటంతో పత్తి మొక్కలు ఎండిపోతున్నాయి.దీంతో రైతులు పంటకాలం పూర్తయ్యే వరకు మొక్కలను ఉంచే పరిస్థితి లేకుండా, ఒకటి రెండు సార్లు పత్తి తీయించి,వెంటనే దుక్కి దున్ని రెండోవ పంట వేసుకునే ఆలోచనలో ఉన్నారు.దీనివల్ల సగటున ఎకరాకు 8 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి 4 నుంచి 6 క్వింటాళ్లకు పడిపోయే ప్రమాదం ఉంది.

**ప్రభుత్వానికి వినతి...**

నారాయణపేట మార్కెట్ అధికారులు వెంటనే పర్యవేక్షణ,పత్తి కొనుగోళ్లపై ఆజమాయిషీ పెట్టాలి.కనీస మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తున్న మిల్లులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.సీసీఐ ద్వారా ప్రభుత్వమే పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి.తగ్గిన దిగుబడికి పంట నష్టపరిహారం అందించేలా కసరత్తు చేయాలి.

**పత్తి రైతుల పక్షాన...:** జిల్లాలోని పత్తి రైతుల పక్షాన జిల్లా యంత్రాంగం దృష్టికి ఈ సమస్యలు తీసుకెళ్తున్నట్లు నారాయణపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండి వేణుగోపాల్ తెలిపారు.

# దళితులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లిన ఘనత కేసీఆర్‌దే

## అంబేద్కర్ ఆశయ సాధన కోసం అందరం ముందుకు సాగాలి

### ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.




ఎల్బీనగర్, (డీకే చాటింపు) దళితులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లి వారి అభ్యున్నతికి కృషి చేసిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత శ్రీ కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) దేనని ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్‌లోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో నాగోల్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కేసీఆర్ నాయకత్వంలో దళిత బంధు పథకం ద్వారా మరింత పెద్ద సంఖ్యలో అర్హులైన దళితులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళిత బంధు స్థానంలో ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పి దళితులను మోసం చేసిందని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి విమర్శించారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో దళితులంతా ఐక్యంగా ఉండి ముందడుగు వేస్తున్నారని, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ విభాగం నాయకులు గోల్కొండ మైసయ్య, మల్లెపాక యాదగిరి, ఉమామహేశ్వర్, పార్షపు శ్రీధర్, మద్దెల నర్సింహ, రుద్రల స్వామి, కడారి పెంటయ్య, రెడ్డి మాల పెద్ద కృష్ణ, స్కైలాబ్, కోదండ సురేష్, కొత్తపేట ప్రభాకర్, రాజేందర్, దప్పు వినోద్, కటేపక రవి, చెంగల్ చంద్ర మోహన్, కొంగర మహేష్, గౌరీశంకర్, సంగిపేట నరేష్, గోపి మధు, జలేందర్, నరేష్, శ్రీనివాస్, ఏర్పుల గాలయ్య, ఏర్పుల యాదయ్య, మహిళా నాయకులు అనిత, పద్మ, విజయలక్ష్మి, నిర్మల, జ్యోతి, రేణుక, లక్ష్మి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడుల వేటలో నెంబర్ 2 గా ఏపీ



విజయవాడ, :ఏపీలో కూటమి ప్రభుత్వం మరో రికార్డు సృష్టించింది. దేశంలోకి వస్తున్న కొత్త పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడంలో గణనీయంగా తన పనితీరు మెరుగుపరుచుకుంది. ప్రముఖ జాతీయ బిజినెస్ పత్రిక బిజినెస్ స్టాండర్డ్స్ ప్రాజెక్టు టుడే నివేదికల ఆధారంగా విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో జాతీయస్థాయిలో రెండవ స్థానంలో నిలిచింది. గత రెండేళ్ల వ్యవధిలో పెట్టుబడుల ర్యాంకింగ్స్‌లో తొమ్మిదో స్థానం నుంచి.. ఏడు స్థానాలకు ఎగబాకి ద్వితీయ స్థానంలో నిలవడం విశేషం. ఇది నిజంగా గొప్ప విషయం. గడిచిన రెండేళ్లలో ఈ పురోగతి సాధించడం గొప్ప పరిణామం. కూటమి ప్రభుత్వానికి ఇది ఊతం ఇచ్చే విషయం.వైసిపి 2024 వరకు అధికారంలో ఉంది. ఆ ఏడాది ముగిసిన ఆర్థిక సంవత్సరంలో.. అంటే 2024 ఏప్రిల్ నాటికి కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీ ప్రభుత్వం దేశంలో తొమ్మిది వ స్థానంలో నిలిచింది. ఆ తదుపరి ఏడాది ఆర్థిక సంవత్సరంలో క్రమేపి పనితీరు మెరుగ్గు పరుచుకుంటూ వచ్చింది. ఇప్పుడు తాజాగా టాప్ 10 జాబితాలో రెండో స్థానంలో నిలవడం విశేషం. పారిశ్రామిక వాతావరణం, ప్రభుత్వ పాలసీల్లో వచ్చిన విప్లవాత్మక మార్పుల వల్లే ఈ గణనీయమైన పురోగతి సాధ్యమైంది.పారిశ్రామిక పెట్టుబడులను సాధించడంలో మహారాష్ట్ర ముందంజలో కొనసాగుతోంది. ఇప్పుడు దానితర్వాత స్థానం ఏపీ దక్కించుకోవడం విశేషం.ఇతర అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను తట్టుకొని ఈ స్థానంలో నిలబడడం అనేది గొప్ప విషయం. రాజస్థాన్ మూడో స్థానంలో ఉండగా.. గుజరాత్ నాలుగోస్థానంలో నిలిచింది. ఒడిస్సా 5వ స్థానంలో ఉండడం గమనించదగ్గ విషయం. అయితే పారిశ్రామికంగా ఎంతో ముందు వరుసలో ఉండే పొరుగు రాష్ట్రాలు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కంటే ఏపీ చాలా వేగంగా పెట్టుబడులను ఆకర్షించిందని అర్థం అవుతోంది.అయితే పెట్టుబడులను ఆకర్షించడంలో మాత్రం ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేష్ పాత్ర ఉంది. ఒకవైపు ప్రభుత్వాన్ని నడుపుతూనే.. పెట్టుబడులను ఆకర్షించడం కోసం వీరు చేసే ప్రయత్నాలు అన్నీ ఇన్ని కావు. తరచూ విదేశీ పర్యటనలు, అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సుకు వెళ్లడం.. ఇలా చాలా రకాల ప్రయత్నాలు ఫలితమే పారిశ్రామిక పెట్టుబడుల సాధనలో రెండో స్థానం. రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పన, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్,, వేగవంతమైన అనుమతులు, సింగిల్ విండో సిస్టం సమర్థవంతంగా పనిచేయడం వల్లే అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నాయి. తొమ్మిదవ స్థానంలో ఉన్న ఏపీని రెండో స్థానంలో నిలపడంలో కూటమి ప్రభుత్వం సక్సెస్ కనిపిస్తోంది. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా జాతీయస్థాయిలో గుర్తింపు లభిస్తోంది..

# స్థానిక ఎన్నికల్లో వైసిపి వారసులు..



**గుంటూరు,** : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్లలో ఒకరకమైన బెంగ కనిపిస్తోంది. వారికి పార్టీ భవిష్యత్ కంటే.. తమ పిల్లల భవిష్యత్తును సెట్ చేయడమే ఒక కర్తవ్యంలా మారింది. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి చూస్తే ఏమంత బాగాలేదు. పైగా అధినేత జగన్మోహన్ రెడ్డి వైఖరి గురించి వారికి తెలియనిది కాదు. అందుకే ఎక్కువ మంది ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెడుతున్నారు. : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్లలో ఒకరకమైన బెంగ కనిపిస్తోంది. వారికి పార్టీ భవిష్యత్ కంటే.. తమ పిల్లల భవిష్యత్తును సెట్ చేయడమే ఒక కర్తవ్యంలా మారింది. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి చూస్తే ఏమంత బాగాలేదు. పైగా అధినేత జగన్మోహన్ రెడ్డి వైఖరి గురించి వారికి తెలియనిది కాదు. అందుకే ఎక్కువ మంది ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెడుతున్నారు. అక్కడ పార్టీ పరిస్థితి మెరుగుపడిందా? పర్వాలేదు. లేకుంటే పార్టీని వదిలి సేఫ్ జోన్ లో తమ వారసులను నిలపాలన్న ఆలోచనతో ఉన్నట్లు కనిపిస్తోంది. 2029 ఎన్నికలు దాటితే చాలామంది ఏడుపదుల వయసు దాటుతారు. అప్పటికి తమ వారసుల రాజకీయ భవిష్యత్తు సెట్ అవుతుందా? లేదా? అనే అనుమానంతో ఉన్నారు.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతలుగా ధర్మాన బ్రదర్స్, బొత్స సత్యనారాయణ, తమ్మినేని సీతారాం లాంటి నేతలు ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లోనే తమ పిల్లలకు టికెట్లు ఇవ్వాలని ధర్మాన బ్రదర్స్ కోరారు. కానీ అందుకు జగన్ అంగీకరించలేదు. అయితే ఇప్పుడు 2029 ఎన్నికల వరకు వేచి చూసే కంటే.. స్థానిక ఎన్నికల్లోనే తమ పిల్లలను బరిలో దించాలని ధర్మాన బ్రదర్స్ చూస్తున్నట్లు తెలుస్తోంది. ధర్మాన కృష్ణ దాస్ కుమారుడిని జిల్లా పరిషత్ చైర్మన్ గాను.. ధర్మాన ప్రసాదరావు కుమారుడ్ని శ్రీకాకుళం నగరపాలక సంస్థ మేయర్ గాను రంగంలోకి దించాలని భావిస్తున్నట్లు సమాచారం. ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో అక్కడ వచ్చే ఓట్ల ప్రభావం, ఫలితాలను అంచనా వేసుకుని 2029 ఎన్నికల నాటికి ఏదో ఒక రాజకీయ నిర్ణయం తీసుకోవాలన్నది ధర్మాన బ్రదర్స్ ఆలోచనగా తెలుస్తోంది.శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్ష నాయకుడిగా ఉన్నారు బొత్స సత్యనారాయణ. ప్రస్తుతం ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు.

# విజయసాయిపార్టీ లీకుల వ్యూహం ఏమిటో



నెల్లూరు, :వైఎస్సార్‌సీపీలో ఒకప్పుడు నంబర్-2గా చక్రం తిప్పి, ఆ తర్వాత రాజకీయ సన్యాసం ప్రకటించిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మళ్లీ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారారు. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయిన అనంతరం తన పదవికి, పార్టీకి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకుంటాను అని చెప్పిన ఆయన, ఇప్పుడు సడన్‌గా కొత్త పొలిటికల్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన తొలినాళ్లలో విజయసాయిరెడ్డి బీజేపీ గూటికి చేరుతారని విస్తృత ప్రచారం జరిగింది. ఢిల్లీ స్థాయిలో ఆయనకున్న పరిచయాలు, కేంద్ర పెద్దలతో ఉన్న సంబంధాల దృష్ట్యా కమలం తీర్థం పుచ్చుకుంటారని భావించారు. అయితే, ఏపీలో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి అధికారంలో ఉంది. విజయ సాయిరెడ్డిని పార్టీలోకి తీసుకుంటే టీడీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందనే భావనతో పాటు, కూటమి ధర్మాన్ని పాటించేందుకు కేంద్ర బీజేపీ నాయకత్వం ఆయన చేరికపై సుముఖత చూపలేదని సమాచారం. బీజేపీ తలకదనం లేకపోవడంతో, అలాగే ఇతర జాతీయ పార్టీల వైపు వెళ్లే అవకాశం లేకపోవడంతో ఆయనకు సొంత బాట పట్టడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేకుండా పోయింది.కొన్ని రోజులుగా ఆయన తిరిగి పాతగూటికి వెళ్తారని ప్రచారం జరుగుతున్నా అది దాదాపు అసాధ్యమని అంటున్నారు. వైఎస్సార్‌సీపీలో అంతర్గతంగా పెరిగిన విభేదాలు, కోటరీతో విభేదించి బయటకు రావడం, ఆ తర్వాత ఆ పార్టీ అధినాయకత్వాన్ని ఉద్దేశించి సోషల్ మీడియా ద్వారా విమర్శనాత్మక పోస్టులు పెట్టడం వల్ల జగన్‌తో ఆయనకు గ్యాప్ పెరిగింది. ఎన్నికల ఓటమి తర్వాత జగన్ కూడా విజయసాయిరెడ్డి వ్యాఖ్యల పట్ల అసంతృప్తిగా ఉన్నారని, ఆయనను తిరిగి చేర్చుకోవడానికి జగన్ సిద్ధంగా లేరనే అభిప్రాయం వినిపించడంతో విజయసాయిరెడ్డి పూర్తిగా వైఎస్సార్‌సీపీ అధ్యాయానికి స్వస్తి చెప్పారని భావించవచ్చుఈ పరిణామాలతో విజయసాయిరెడ్డి భారత్ జన వికాస్ పేరుతో సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు ముహూర్తం ఖరారు చేసుకుంటున్నట్లు లీకులు బయటకు వచ్చాయి. శ్రావణ మాసం ముగిసేలోపు పార్టీ ప్రకటన ఉండే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. మహిళలు, రైతులు, యువత, సమగ్ర రాష్ట్రాభివృద్ధే ఎజెండాగా ప్రాంతాల వారీగా సభలు నిర్వహించాలని ఆయన యోచిస్తున్నారు. అయితే ఈ పార్టీ వెనుక మరికొందరు ముఖ్యుల ఆశీస్సులు ఉన్నాయా? లేదా ఇతర రాజకీయ శక్తులు తెరవెనుక ఉండి నడిపిస్తున్నాయా? అనే సందేహాలు కూడా రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రం ప్రస్తుతం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి , వైఎస్సార్‌సీపీల మధ్య ముఖాముఖి పోరుగా ఉంది. ఈ బైపోలార్ పొలిటికల్ వాతావ రణంలో మూడో శక్తిగా నిలబడటం లేదా సొంత పార్టీతో ప్రభావం చూపడం అత్యంత సంక్లిష్టమైన అంశం. విజయసాయిరెడ్డికి మాస్ క్యాడర్ ఆధారిత ప్రజాదరణలేకపోవడం, కేవలం ఆర్గనైజర్ , స్ట్రాటజిస్ట్‌గా మాత్రమే గుర్తింపు ఉండటం ప్రధాన పరిమితి. ఒకవేళ పార్టీ పెట్టినా, ఆయన సాధించే ఓటింగ్ శాతం కూటమికి లాభం చేకూరుస్తుందా లేక వైఎస్సార్‌సీపీ ఓట్ బ్యాంక్‌కే గండికొడుతుందా అనేది వేచి చూడాలి. భారీ ఆర్థిక వనరులు, బలమైన క్యాడర్ లేనిదే కొత్త పార్టీ నిలదొక్కుకోవడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఫినిషింగ్ దశకు కడప స్టార్టప్ హబ్

**కడప** :రాయలసీమ ప్రాంతంలో ఐటీ, సాంకేతిక రంగాల ముఖచిత్రాన్ని మార్చేందుకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కడప స్టార్టప్ హబ్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇప్పటివరకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాలకే పరిమితమైన స్టార్టప్ సంస్కృతిని రాయలసీమ యువతకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఇది రూపుదిద్దుకుంది. స్థానిక నిరుద్యోగ యువత ఉన్నత చదువుల అనంతరం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లే అవసరం లేకుండా, ఇక్కడే కొత్త ఆవిష్కరణలు, వ్యాపారాలు ప్రారంభించేందుకు ఇది అద్భుత వేదికగా నిలవనుంది. అత్యాధునిక మౌలిక సదుపాయాలతో సిద్ధమైన ఈ భవనాన్ని త్వరలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించేందుకు కడప జిల్లా యంత్రాంగం వేగంగా సన్నాహాలు చేస్తోంది.ఉద్యోగాల కోసం ఆశించే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి.. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలి" అన్న ముఖ్యమంత్రి చంద్రబాబు




నాయుడు దూరదృష్టికి అనుగుణంగా జిల్లా పాలనా యంత్రాంగం ఈ ప్రాజెక్టును ఆకృతి చేసింది. స్టార్టప్ కడప పేరుతో పిలిచే ఈ ప్రతిష్టాత్మక హబ్‌ను ఖ4 మోడల్‌లో రూపొందించారు.

# ఎప్పుడూ ఆ నియోజకవర్గం రాజకీయమే...

అనంతపురం, :రాష్ట్రంలో వైసీపీ వర్సెస్ టీడీపీ, జనసేన అనేలా చాలా నియోజకవర్గాలు ఉన్నాయి. కానీ, ఓ నియోజకవర్గంలో మాత్రం 'అంతకుమించి' అన్నట్టుగా ఇరు పక్షాల మధ్య ముఖ్యంగా స్థానిక నేతల మధ్య రాజకీయాలు రగులుతున్నాయి. నానాటికీ ఈ రాజకీయ వ్యూహాలు.. పెరుగుతూనే ఉన్నాయి. అదే...ఉమ్మడి అనంతపురం జిల్లాలోని తాడిపత్రి నియోజకవర్గం. ఇక్కడ జేసీ వర్సెస్ పెద్దారెడ్డి మధ్య రాజకీయాలు నిరంతరం నివ్వులు చెరుగుతూనే ఉన్నాయి ఇతర నియోజకవర్గాల్లోనూ వైసీపీ వర్సెస్ టీడీపీ అన్నట్టుగా రాజకీయాలు ఉన్నప్పటికీ.. ఇక్కడ మరింత భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని నియోజకవర్గంలోకి రాకుండా అడ్డుకుంటామని.. ఆయన నియోజకవర్గంలో అడుగు పెట్టేది కూడా లేదని శపథం చేసిన టీడీపీ సీనియర్ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి అలానే వ్యవహరిస్తున్నారు. గత రెండున్నరేళ్లుగా రాష్ట్రంలో రగులుతున్న ఏకైక నియోజకవర్గం కూడా ఇదే కావడం గమనార్హం... నియోజకవర్గంలో అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం ఎక్కడైనా ఉంటుంది. తాడిపత్రిలో మాత్రం రాజకీయాలకు ఇస్తున్న ప్రాధాన్యం వైసీపీ హయాంలోను.. ప్రస్తుత కూటమి హయాంలోనూ అభివృద్ధిని మించి ఉంటోందన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. యువ ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నా.. రాజకీయంగా జేసీ వేస్తున్న అడుగుల కారణంగా.. అభివృద్ధిపై పెద్దగా చర్చ జరగడం లేదు. గత వైసీపీ దెబ్బతిన్నది కూడా ఇక్కడే. ముందుగా అభివృద్ధిపై ప్రచారం ఎక్కువగా ఉంటే.. అది అల్టిమేట్‌గా పార్టీలకు కలిసి వస్తుంది.

# నిర్మాణ రంగంలోనూ నిపుణులు కొరత....



భారత్‌లో మౌలిక సదుపాయాలు, తయారీ, ఇంధనం, పట్టణాభివృద్ధి రంగాల్లో పెట్టుబడులు వేగంగా పెరుగుతున్నాయి. దీంతో నిర్మాణ రంగంలో ప్రాజెక్ట్‌లను సమర్థంగా నడిపించే నిపుణులకు డిమాండ్ భారీగా పెరగనుంది. అమెరికాకు చెందిన ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (పీఎంఐ) విడుదల చేసిన 'కన్‌స్ట్రక్షన్ టాలెంట్ గ్యాప్' నివేదిక ప్రకారం, భారత్‌లో మౌలిక సదుపాయాల కల్పన వేగవంతమవుతున్న వేళ ప్రాజెక్ట్ మేనేజర్ల కొరత తీవ్రం కానుంది. 2035 నాటికి దేశానికి అదనంగా దాదాపు 1,60,000 మంది కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్ట్ మేనేజర్లు అవసరమవుతారని నివేదిక స్పష్టం చేసింది. ఇది ప్రస్తుత అవసరాల కంటే ఏకంగా 67 శాతం ఎక్కువ.

భారత ఆర్థిక వ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెందుతున్నందున, దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చేపడుతున్న నిర్మాణ ప్రాజెక్టులను సకాలంలో, సమర్థవంతంగా పూర్తి చేయడానికి ఈ రంగానికి ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన ప్రాజెక్ట్ మేనేజర్లు తక్షణమే అవసరమని పీఎంఐ గిగాప్రాజెక్ట్స్ వైస్ ప్రెసిడెంట్ బెన్ బ్రీన్ తెలిపారు. ప్రస్తుతం భారత్ కేవలం ప్రాజెక్టుల సంఖ్యను పెంచడం మాత్రమే కాకుండా... తయారీ, ఇంధన, పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల రంగాలలో భారీ స్థాయి పెట్టుబడులను వేగవంతం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల ప్రాజెక్టుల పరిమాణం పెరగడమే కాకుండా, వాటి నిర్వహణ కూడా అత్యంత సంక్లిష్టంగా మారుతోందన్నారు. దేశంలో అద్భుతమైన ఇంజనీరింగ్, సాంకేతిక ప్రతిభకు కొదవలేదని, అయితే ప్రాజెక్ట్ ఆలోచన దశ నుండి పూర్తి స్థాయి నిర్మాణం

పూర్తయ్యే వరకు ప్రణాళికాబద్ధంగా నడిపించగల అనుభవజ్ఞులైన ప్రాజెక్ట్ మేనేజర్ల అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇదే సమయంలో కృత్రిమ మేధ (ఏఐ) వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు నిపుణులను ఎలా సిద్ధం చేయాలనే అంశంపై అక్టోబర్ 3న బెంగళూరు వేదికగా జరిగే సదస్సులో కీలక చర్చలు జరగనున్నాయి.

# కాగ్నిజెంట్‌కు గ్రీన్‌కార్డు దరఖాస్తుల నిలిపివేత

ఐటి సేవల దిగ్గజం కాగ్నిజెంట్‌కు అమెరికా కార్మిక శాఖ షాక్ ఇచ్చింది. ఆ సంస్థకు చెందిన ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డు ప్రక్రియకు అత్యంత కీలకమైన పెర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ (పిఇఆర్ఎం) దరఖాస్తులను అమెరికా కార్మిక శాఖ తాత్కాలికంగా నిలిపివేసింది. వీసా నిబంధనల ఉల్లంఘనలు, మోసాల ఆరోపణలపై జరుగుతున్న సమగ్ర విచారణ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అమెరికా కార్మిక శాఖ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆంథోనీ డి ఎస్పోసిటో సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. వైట్‌హౌస్ ఫ్రాడ్ టాస్క్‌ఫోర్స్‌తో కలిసి సంయుక్తంగా ఈ దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు. అమెరికా కార్మికులకు వ్యతిరేకంగా జరిగే ఎలాంటి మోసాలను లేదా బెదిరింపులను సహించేది లేదని, విచారణ పూర్తయ్యే వరకు కాగ్నిజెంట్ కొత్తగా పిఇఆర్ఎం దరఖాస్తులు సమర్పించడానికి అనుమతి ఉండదని ఆయన స్పష్టం చేశారు. కాగ్నిజెంట్‌తో పాటు క్లౌడెరా సంస్థకు సంబంధించిన దరఖాస్తులను కూడా నిలిపివేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ నిలిచిపోవడం వల్ల కాగ్నిజెంట్‌లో పనిచేస్తున్న విదేశీ నిపుణులు, ముఖ్యంగా భారత్‌కు చెందిన టెకీల గ్రీన్‌కార్డు దరఖాస్తుల ప్రక్రియకు తాత్కాలిక బ్రేక్ పడే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే ఆమోదం పొందిన వాటిపై లేదా ప్రస్తుత ఉనికిలో ఉన్న వీసాలపై దీని ప్రభావం ఉంటుందా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.




# బ్యారెల్ చమురు 100 డాలర్లు



అమెరికా యుద్ధోన్మాదంతో పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తలు ప్రపంచ ప్రజలపై తీవ్ర ధరల భారాన్ని పెంచుతోంది. ఈ భౌగోళిక ఘర్షణలతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భగ్గుమన్నాయి. జులై 24 తర్వాత తొలిసారిగా ముడి చమురు ఫ్యూచర్స్ ధర బ్యారెల్ 100 డాలర్ల మార్కును దాటాయి. అమెరికా-ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు, రవాణా మార్గాలకు ఎదురవుతున్న తీవ్ర ఆటంకాల కారణంగా చమురు సరఫరాపై ఆందోళనలు పెరిగాయి. బుధవారం బ్రెంట్ చమురు ఫ్యూచర్స్ 2.15 డాలర్లు లేదా 2.2 శాతం పెరిగి 100.07 డాలర్లకు చేరుకుంది. అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యుటిఐ) చమురు 1.70 డాలర్లు పెరిగి 94.73 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. గత నెల ప్రారంభంతో పోలిస్తే బ్రెంట్ ధరలు సుమారు పావు వంతు పెరిగినట్లు మార్కెట్ నిపుణులు వెల్లడిస్తున్నారు.

అమెరికా యుద్ధ నౌకలపై దాడుల ప్రయత్నాలకు ప్రతిస్పందనగా ఇరాన్ ఆయిల్ ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకుంటామని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్ భూభాగం నుంచి ప్రయోగించిన 20 బాలిస్టిక్ క్షిపణుల్లో 180 పైగా జోర్డాన్ వైమానిక రక్షణ వ్యవస్థ విజయవంతంగా అడ్డగించిందని ఆ దేశ సైనిక వర్గాలు తెలిపాయి.

పశ్చిమాసియాలో రవాణా మార్గాలపై దాడిల తీవ్రత పెరిగితే చమురు బ్యారెల్ ధర 120 డాలర్లకు చేరుకోవచ్చని గోల్డ్‌మన్ శాక్స్ హెచ్చరించింది. సరఫరాలో అంతరాయాల కాలపరిమితి మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్న జెపి మోర్గాన్ పేర్కొంది. ప్రతి నెలా ఈ ఆటంకాలు కొనసాగితే బ్రెంట్ ధర మరో 7 నుండి 8 డాలర్లు పెరిగే అవకాశం ఉందన్నారు. మూడు నెలలు కొనసాగితే సగటున 114 డాలర్లకు చేరుకోవచ్చని అంచనా వేసింది. హర్మూజ్ జలసంధి పునరుద్ధరణ ఆలస్యం కానుండటంతో సిటీ బ్యాంక్ తన మూడో త్రైమాసిక అంచనాను 80 డాలర్ల నుంచి 86 డాలర్లకు సవరించింది. ఎఎన్‌జడ్ విశ్లేషకులు కూడా స్వల్పకాలిక బ్రెంట్ అంచనాను 95 డాలర్లకు పెంచారు. ఈ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే పూర్తి స్థాయి సరఫరా సాధారణ స్థితికి రావడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

# దలాల్ స్ట్రీట్‌కు చమురు సెగ సెన్సెక్స్ 800 పాయింట్లు పతనం




అమెరికా విధానాలతో అంతర్జాతీయంగా ముంచుకొస్తున్న యుద్ధ మేఘాలు, ముడి చమురు ధరల అసాధారణ పెరుగుదల దేశీయ స్టాక్ మార్కెట్లను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. దలాల్ స్ట్రీట్‌లో వరుసగా మూడో రోజు కూడా అమ్మకాల ఒత్తిడి తీవ్రంగా కొనసాగింది. పశ్చిమాసియాలో రాజుకున్న ఉద్రిక్తతలు మదుపర్లను భయాందోళనలకు గురిచేయడంతో బుధవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 813 పాయింట్లు పతనమై 74,764కు పడిపోయింది. అదే బాటలో నిఫ్టీ50 సుమారు 204 పాయింట్లు కోల్పోయి 23,431 వద్ద ముగిసింది. ఈ ఒక్క రోజే బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ ఏకంగా రూ. 2 లక్షల కోట్లకు పైగా ఆవిరై రూ.484 లక్షల కోట్లకు పడిపోయింది. ఇరాన్-అమెరికా ఘర్షణలు తీవ్రతరం కావడంతో భౌగోళిక రాజకీయ పరిస్థితులు పూర్తిగా దిగజారాయి. యెమెన్‌లోని ఇరాన్ మద్దతుగల హౌతీ రెబెల్స్ సౌదీ అరేబియా నగరాలపై క్షిపణి దాడులకు పాల్పడటం, అమెరికా బలగాలు ఇరాన్‌కు చెందిన పలు ఆయిల్ ట్యాంకర్లను ధ్వంసం చేయడం ఉద్రిక్తతలను తారాస్థాయికి చేర్చింది.

మరోవైపు జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ దాడి జరగడం, గల్ఫ్ జలాల్లో నౌకలపై దాడులు పెరగడం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపింది. యుద్ధ తీవ్రత పెరుగుతుండటంతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ఆయిల్ ధర బ్యారెల్ 100 డాలర్ల మార్కును దాటింది. రాబోయే రోజుల్లో చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ప్రముఖ ఆర్థిక సంస్థలు హెచ్చరించడం మార్కెట్లను తీవ్ర ఒత్తిడికి గురి చేశాయి. మార్కెట్ పతనంలో టెక్నాలజీ దిగ్గజాలు తీవ్ర నష్టాలను చవిచూశాయి. నిఫ్టీ ఐటి ఇండెక్స్ ఏకంగా 3 శాతానికి పైగా కుప్పకూలింది. ఇన్ఫోసిస్, టిసిఎస్, టెక్ మహీంద్రా తదితర షేర్లు 2 నుంచి 5 శాతం వరకు నష్టపోయి సూచీలను కిందికి లాగాయి. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 95.1050 స్థాయికి పడిపోయింది. విదేశీ సంస్థాగత మదుపర్లు వరుసగా పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం భారతీయ కరెన్సీపై తీవ్ర ఒత్తిడిని పెంచుతోందని ఎల్‌కెపి సెక్యూరిటీస్ నిపుణులు తెలిపారు.యుఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాలు వెలువడనున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో రూపాయి కదలికలు మరింత ఆందోళనకరంగా మారే అవకాశం ఉంది. భారత ఈక్విటీ మార్కెట్లలో విదేశీ సంస్థాగత మదుపర్లు నికర అమ్మకందారులుగా కొనసాగుతున్నారు. ఈ నెలలో ఇప్పటికే పలు సెషన్లలో వారు పెద్దఎత్తున షేర్లను విక్రయించడం దలాల్ స్ట్రీట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. నిఫ్టీ సూచీ తన వరుస బేరిష్ ధోరణిని కొనసాగిస్తూ స్వల్పకాలంలో 23,300 - 23,200 స్థాయిల వరకు పడిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఉబర్‌లో రిమోట్ వర్క్‌కు బ్రేక్..




ఇటీవల భారీ సంఖ్యలో లేఆఫ్స్ చేపట్టిన ప్రముఖ క్యాబ్ సేవల కంపెనీ ఉబర్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. క్రమంగా వర్క్ ఫ్రమ్ హోమ్ విధానానికి దూరమవ్వాలని నిర్ణయించింది. కంపెనీ కొత్త వర్క్ పాలసీ ప్రకారం, పూర్తిగా రిమోట్‌గా పనిచేసే ఉద్యోగాల సంఖ్యను మొత్తం గ్లోబల్ వర్క్‌ఫోర్స్‌లో కేవలం 1 శాతానికే పరిమితం చేయనుంది. ఉద్యోగులందరినీ కీలక ఆఫీసుల చుట్టూ ఏర్పాటు చేసిన 'హబ్'లలో పనిచేసే విధానానికి మార్పులు చేస్తోంది. వీటితో పాటు ప్రాంతీయ, టెక్నాలజీ హబ్‌లను కూడా ఏర్పాటు చేయనుంది. ప్రస్తుతం రిమోట్‌గా పనిచేస్తూ ఈ హబ్‌లకు దూరంగా ఉన్న ఉద్యోగులు ఇకపై ఆఫీసుకు దగ్గరగా మారడం లేదా తమ ఉద్యోగంపై నిర్ణయం తీసుకోవడం వంటి పరిస్థితిని ఎదుర్కొనే అవకాశం ఉంది. ఉబర్ ఇప్పటికే అమలు చేస్తున్న వారానికి కనీసం మూడు రోజులు ఆఫీసు నుంచి పనిచేసే హైబ్రిడ్ విధానాన్ని కూడా మరింత కఠినంగా అమలు చేయనుంది. భవిష్యత్తులో కంపెనీ వర్క్ మోడల్ పూర్తిగా వర్క్ ఫ్రమ్ హోమ్ కంటే 'హబ్, హైబ్రిడ్' విధానానికి దగ్గరగా ఉండనుంది. టెక్ పరిశ్రమలోని ఇతర కంపెనీలు కూడా రిమోట్ వర్క్ సదుపాయాన్ని తగ్గిస్తూ ఆఫీస్-బేస్డ్ వర్క్ వైపు మారుతున్న సమయంలో ఉబర్ తీసుకున్న ఈ నిర్ణయం ఉద్యోగుల పని విధానంలో పెద్ద మార్పునకు సంకేతంగా కనిపిస్తోంది.

# రూ. 2 లక్షల కోట్ల మార్కు చేరిన నికర సిప్ పెట్టుబడులు...




ఈక్విటీ మార్కెట్లలో తీవ్ర హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ, 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశంలో నికర సిప్ పెట్టుబడులు రికార్డు స్థాయిలో రూ. 2 లక్షల కోట్లకు చేరాయి. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వార్షిక నివేదిక ప్రకారం, గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం సిప్ పెట్టుబడుల విలువ రూ. 3.5 లక్షల కోట్లుగా నమోదు కాగా, అందులో నికర పెట్టుబడుల వాటా 56 శాతానికి పెరిగింది.

ఇది గత మూడేళ్లలోనే అత్యధికం. మదుపరులు విత్‌డ్రాయల్స్ చేసిన తర్వాత మిగిలిన నికర పెట్టుబడులు రూ. 2 లక్షల కోట్లుగా ఉన్నాయి. మరోవైపు, సిప్‌ల నుంచి బయటకు వెళ్లిన మొత్తం రూ. 1.3 లక్షల కోట్ల నుంచి రూ. 1.5 లక్షల కోట్లకు పెరిగింది. అంటే విత్‌డ్రాయల్స్ 15 శాతం పెరిగాయి. అయితే గత మూడేళ్లతో పోలిస్తే ఇది చాలా తక్కువ అని మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ ప్రతినిధి సురంజన బోర్తకూర్ తెలిపారు. మరోవైపు, సిప్ పెట్టుబడులను చిన్న మదుపరులు తాత్కాలిక మార్కెట్ బెట్టింగ్‌గా కాకుండా దీర్ఘకాలిక పొదుపు సాధనంగా చూస్తున్నారని నిపుణులు పేర్కొన్నారు.

# రికార్డు స్థాయిలో ఈవీ అమ్మకాలు...



దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) మార్కెట్ మరింత వేగంగా విస్తరిస్తోంది. ఆగస్టు నెలలో దేశవ్యాప్తంగా ఈవీ రిటైల్ అమ్మకాలు ఏడాది క్రితంతో పోలిస్తే 52.9 శాతం పెరిగి 2,98,448 యూనిట్లకు చేరుకున్నాయి. దీంతో మొత్తం వాహన అమ్మకాల్లో ఈవీల వాటా 9.5 శాతం నుంచి 12.3 శాతానికి పెరిగింది. ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఫాడా) ప్రకారం, ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల విభాగంలో అమ్మకాలు 67.05 శాతం పెరిగి 1,83,204 యూనిట్లకు చేరాయి. ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు కూడా 30,696 యూనిట్లకు పెరిగాయి. త్రీ-వీలర్ విభాగంలో 25.28 శాతం పెరిగి 79,846 యూనిట్లకు చేరుకోగా, ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహనాల అమ్మకాలు ఏకంగా మూడు రెట్లు పెరిగి 4,702 యూనిట్లకు చేరాయి. ఆగస్టు నెల పండుగల సీజన్ లేకపోయినా ఎలక్ట్రిక్ టూ-వీలర్లు 10 శాతానికి పైగా మార్కెట్ వాటాను నిలబెట్టుకున్నాయని ఫాడా అధ్యక్షుడు సాయి గిరిధర్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం మొత్తం ఈవీ అమ్మకాల్లో వీటి వాటా 60 శాతానికి పైగానే ఉంది.

# సాధ్వీగా మారేందుకు 20 ఏళ్ల యువతికి అనుమతి..

భోపాల్, : ఓ 20 ఏళ్ల యువతి భౌతిక సుఖాలను త్యజించి, తాను సాధ్వీగా మారాలని నిర్ణయించుకుంది. అయితే, తమ కుమార్తె నిర్ణయాన్ని తల్లిదండ్రులు, ఆమె బంధువులు తీవ్రంగా వ్యతిరేకించారు. అందరిలాగే తమ కుమార్తెకు పెళ్లిచేసి, అత్తారింటికి పంపాలని భావించిన ఆ తల్లిదండ్రులు వద్దని వారించారు. కన్న కూతురిపై మమకారంతోనే వాళ్లు అభ్యంతరం చెప్పారు. దీంతో ఆమె న్యాయస్థానానికి వెళ్లారు. హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడంతో.. విచారణ చేపట్టింది. ఆమె తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించి, మద్దతు తెలిపింది.ప్రాపంచిక సుఖాలను త్యజించి, సన్యాసం స్వీకరించాలని నిర్ణయించుకున్న ఓ 20 ఏళ్ల యువతికి మధ్యప్రదేశ్ హైకోర్టు మద్దతుగా నిలిచింది. తన మతాన్ని స్వేచ్ఛగా అనుసరించే, ఆచరించే ప్రాథమిక హక్కు ఆమెకు ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. అంతేకాదు, యువతి సహాయం కోరితే తల్లిదండ్రుల నుంచి ఎలాంటి బలవంతం లేదా వేధింపులు ఎదురుకాకుండా రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు ఇండోర్ ధర్మాసనం తీర్పు వెలువరించింది. తనీషా అనే యువతి దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై జస్టిస్ సందీప్ ఎన్. భట్ విచారణ చేపట్టారు.తాను శ్వేతాంబర్ జైన ధర్మాన్ని అనుసరించి, సన్యాసం స్వీకరించాలని నిర్ణయించుకున్నట్టు ఆమె కోర్టుకు వివరించారు. అయితే, ఈ నిర్ణయాన్ని తన తల్లిదండ్రులు, బంధువులు వ్యతిరేకిస్తూ వేధిస్తున్నారని, తనకు పోలీసు రక్షణ కల్పించాలని అభ్యర్థించారు. అంతేకాదు, మతపరమైన దీక్షలో తల్లిదండ్రులు, బంధువులు జోక్యం చేసుకోకుండా నిరోధించాలని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 21, 25, 26 ప్రకారం తనకు లభించే ప్రాథమిక హక్కులను స్వేచ్ఛగా ఉపయోగించుకోవడానికి అనుమతించాలని ఆమె కోరారు.పిటిషనర్ తరఫున హాజరైన న్యాయవాది ఆశిష్ జోషి వాదనలు వినిపిస్తూ.. రక్షణ కల్పించాలని ఇండోర్ పోలీస్ కమిషనర్‌కు ఇప్పటికే ఫిర్యాదు చేశామని, అది ఇంకా పెండింగ్‌లో ఉందని తెలిపారు. పిటిషనర్‌పై ఆమె తల్లిదండ్రులు లేదా బంధువుల నుంచి ఎలాంటి వేధింపులు, బలవంతం లేకుండా చూడాలని కోరారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ గర్విత్ జైన్ హాజరయ్యారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి.. మేజర్ అయిన ఆమెకు 'తనకంటూ ఒక మార్గాన్ని ఎంచుకుని మతాన్ని అనుసరించే, తన ఇష్టానుసారం జీవించే హక్కు ఉంది' అని పేర్కొన్నారు.ఆమె ఇప్పటికే జైన ధర్మాన్ని అనుసరిస్తోందని, ఇప్పుడు ప్రపంచాన్ని విడిచిపెట్టి సాధ్వీగా జీవించాలని నిర్ణయించుకుందన్నారు. అయితే తల్లిదండ్రులు, బంధువులు ఆమెపై ఉన్న ప్రేమానురాగాల వల్ల అడ్డుకోడానికి ప్రయత్నిస్తున్నారని కోర్టు గుర్తించింది. సమాజంలో పలుకుబడిన కలిగిన తల్లిదండ్రులు తనను దీక్ష తీసుకోనివ్వరనే పిటిషనర్ భయాన్ని కూడా కోర్టు నమోదు చేసింది.ఈ సందర్భంగా "పిటిషనర్ పట్ల ఎంత సానుభూతి ఉందో, ఆమె తల్లిదండ్రుల పట్ల కూడా అంతే సానుభూతి ఉంది" అని ధర్మాసనం పేర్కొంటూ, తల్లిదండ్రుల వ్యతిరేకత కూతురిపై ఉన్న మమకారం నుంచే వచ్చిందని గుర్తించింది. అయినప్పటికీ, 18 ఏళ్లు నిండిన వ్యక్తికి చట్టపరమైన హక్కుల రక్షణ పొందే హక్కు ఉందని, చట్టం దృష్టిలో ఎవరైనా కలిగించే అడ్డంకులను అనుమతించలేమని స్పష్టం చేసింది.'లతా సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ యూపీ' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. మేజర్లు తమ స్వంత నిర్ణయాలు తీసుకోవడానికి స్వతంత్రులని, అలాంటి వారి ప్రయోజనాలను కాపాడటం కోర్టుల బాధ్యత అని పునరుద్ఘాటించింది. అంతేకాకుండా, పిటిషనర్ దరఖాస్తు చేసుకుంటే పోలీసులు ఎలా వ్యవహరించాలో సూచించడానికి 'శక్తి వాహిని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' తీర్పును కూడా ఉదాహరించింది.పూర్తిస్థాయి ప్రాథమిక రక్షణ ఉత్తర్వులు ఇవ్వడానికి బదులుగా హైకోర్టు ఒక పరిష్కారాన్ని చూపింది. తన తల్లిదండ్రులతో సహా ఎవరైనా బలవంతం చేస్తే సహాయం కోరుతూ ఎస్పీ లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. అలాంటి దరఖాస్తు అందగానే, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారి వెంటనే రంగంలోకి దిగి సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.ఈ ఆదేశాలతో హైకోర్టు ఆ రిట్ పిటిషన్‌ను ముగిస్తూ.. పిటిషనర్ సహాయం కోరితే పోలీసులు జోక్యం చేసుకోవచ్చని స్పష్టం చేసింది. అదే సమయంలో, ఒకరి మతపరమైన ఎంపికను వారి కుటుంబం శాసించలేదని స్పష్టమైన వ్యాఖ్యలు చేసింది.

# మైలార్ దేవ్ పల్లి పరిధిలో విషాదం

## వేడి నీళ్ల బకెట్లో పడి నాలుగేళ్ల చిన్నారి మృతి

రాజేంద్రనగర్ : మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. వేడి నీళ్ల బకెట్లో పడి నాలుగేళ్ల బాలిక మృతి చెందింది స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతి నగర్ మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఒక కుటుంబం ఉపాధి నిమిత్తం ప్రగతి నగర్లో నివాసముంటోంది. ఓ కంపెనీలో పనిచేసే బాలిక తల్లి, పని ముగించుకుని ఇంటికి వచ్చిన తర్వాత స్నానం చేయడానికి బకెట్లో వాటర్ హీటర్ పెట్టి నీళ్లను వేడి చేస్తోంది అదే సమయంలో తల్లికి ఫోన్ రావడంతో బయటికి వెళ్లింది అక్కడే ఆడుకుంటున్న నాలుగేళ్ల చిన్నారి మానస ప్రమాదవశాత్తూ వేడి నీళ్ల బకెట్లో పడిపోయింది. నీళ్ల వేడికి తీవ్రంగా గాయపడిన చిన్నారిని వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి పాప మృతి చెందింది. ఈ ఘటనపై మైలార్ దేవ్ పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# యువతే దేశ భవిష్యత్తు

## - వికసిత భారత్ నిర్మాణంలో విద్యార్థులే కీలకం:

నాచారం ఫిల్లీ పబ్లిక్ స్కూల్ (ఆఖూ) యూత్ పార్లమెంట్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు .ప్రజాస్వామ్య దేవాలయాలైన చట్టసభలు దూషణల వేదికలుగా మారడం దురదృష్టకరమని, విద్యావంతులైన యువతరం రాజకీయాల్లోకి వచ్చినప్పుడే దేశ భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పిలుపునిచ్చారు. నాచారం ఆఖూ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రజాస్వామిక క్రమశిక్షణ, సభా మర్యాదలు, పరిణతి చెందిన విధివిధానాలు నేటి రాజకీయ నాయకులకు ఆదర్శనీయమని ఆయన అభినందించారు.ప్రజాస్వామ్య దేవాలయాలైన అసెంబ్లీ, పార్లమెంట్‌లలో ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చలు జరగాలని, అధికార-విపక్షాలు పరస్పరం దూషణలకు పరిమితం కాకుండా ప్రజల గొంతుకగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. నేడు తెలంగాణ అసెంబ్లీలో జరుగుతున్న రభస, నిరాధార ఆరోపణలు, సభా ఔచిత్యాన్ని దెబ్బతీసే వైఖరిని చూసి ప్రస్తుత ప్రజాప్రతినిధులు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాల ప్రసారాలను టీవీల్లో చూపిస్తే పిల్లలు చెడు భాషను నేర్చుకుంటారనే ఆందోళనతో తల్లిదండ్రులు టీవీలు కట్టేసే దుస్థితి నెలకొనడం అత్యంత దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై సేవాభావం, నైతిక విలువలు, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న విద్యావంతులైన యువత రాజకీయాల్లోకి నాయకులుగా రావాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం విభిన్న మతాలు, కులాలు, భాషలతో కూడిన భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతోందని, మతం లేదా కులం పేరుతో సమాజాన్ని విభజించడాన్ని అందరం తీవ్రంగా వ్యతిరేకించాలని స్పష్టం చేశారు. నేడు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా, సుమారు 7.8 శాతం వృద్ధి రేటుతో 'వికసిత భారత్' దిశగా దూసుకుపోతోందని గుర్తుచేశారు.దేశంలో రైల్వేలు, విమానాశ్రయాలు, విద్యా వసతులన్నీ సామాన్య ప్రజలు చెల్లించే పన్నుల ద్వారానే సాధ్యమవుతున్నాయి. పేదల కష్టార్జితంతో చదువుకుని సమాజ శ్రేయస్సును విస్మరిస్తే దేశద్రోహమేనన్న స్వామి వివేకానందుడి మాటలను విద్యార్థులు గుర్తుంచుకోవాలి. సమాజం పట్ల బాధ్యతాయుతమైన నిజమైన దేశభక్తులుగా ఎదిగి, వికసిత భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని రాంచందర్ రావు గారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అమెరికా నుంచి బంగారం తరలిస్తున్న నెదర్లాండ్స్



హైదరాబాద్, : రష్యా, ఉక్రెయిన్ వార్ కారణంగా యూరప్, అమెరికా, ఇరాన్ యుద్ధం కారణంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ యుద్ధాల ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోంది. అనిశ్చితి పెరుగుతున్న సమయంలో అమెరికాపై విశ్వాసం కూడా సన్నగిల్లుతోంది. నెదర్లాండ్స్ కేంద్ర బ్యాంకు (డీఎన్‌బీ) కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికాలోని గణనీయమైన పరిమాణంలో బంగార నిల్వలను సురక్షిత ప్రదేశానికి మార్చింది. అమెరికా, కెనడా నుంచి సుమారు 86 టన్నుల బంగారాన్ని తీసుకొచ్చి లండన్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వాల్ట్‌లో ఉంచింది. సంక్షోభ సమయంలో తక్షణ లావాదేవీలకు అనుకూలంగా ఉండేలా చేసిన వ్యూహంగా భావిస్తున్నారు.ఈ ఏడాది మార్చి నుంచి ఆగస్టు మధ్య కాలంలో తరలింపు ఆపరేషన్ జరిగింది. మొదటి దశలో సుమారు 27 టన్నులను అమెరికా, కెనడా బ్యాంకుల నుంచి నేరుగా తీసుకొచ్చి నెదర్లాండ్స్ మింటుగా లండన్‌కు చేర్చారు. మిగిలిన భాగాన్ని న్యూయార్క్‌లో విక్రయించి, లండన్‌లో తిరిగి కొనుగోలు చేసే పద్ధతిని అవలంబించారు. రవాణా సమయంలో ఎదురయ్యే ప్రమాదాలు, భద్రతా సవాళ్లను దృష్టిలో ఉంచుకుని వివిధ దశల్లో, వేర్వేరు రూపాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేశామని డచ్ కేంద్ర బ్యాంకు స్పష్టం చేసింది. ఇలా చేయడం వల్ల ఏకమొత్తంలో తరలించే రిస్క్ తగ్గిందని తెలిపింది.ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితులే బంగారం తరలింపునకు ప్రధాన కారణం.. అమెరికా, కెనడా మధ్య పరస్పర సుంకాలు విధించుకుంటున్న వాణిజ్య ఉద్రిక్తతలు, ఇరాన్‌తో సంబంధించిన ఉద్రిక్తతలు, పశ్చిమాసియా అశాంతి వంటివి ప్రపంచ వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. ఇటువంటి అనిశ్చిత వాతావరణంలో బంగారం వంటి ఆస్తిని సులభంగా యాక్సెస్ చేసుకునే, వ్యాపారం చేసే ప్రదేశంలో ఉంచాలనే ఆలోచనతోనే ఈ చర్య తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.లండన్ ప్రపంచంలోనే అతిపెద్ద బంగార మార్కెట్‌గా నిలుస్తోంది. అక్కడ కొనుగోలు, విక్రయం, తాకట్టు వంటి లావాదేవీలు చాలా సులభం, వేగవంతం. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వాల్ట్‌లు అత్యంత ఉన్నత స్థాయి భద్రతా వ్యవస్థతో కూడి ఉన్నాయి. బాంబు దాడులను కూడా తట్టుకునేలా నిర్మించబడ్డాయి, అనధికార ప్రవేశం దాదాపు అసాధ్యం. ప్రపంచంలోని మొత్తం బంగార నిల్వల్లో సుమారు ఐదో వంతు ఇక్కడ ఉంది. వీటిలో 90 శాతానికి పైగా వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు, పెద్ద సంస్థలకు చెందినవి. కేవలం చిన్న భాగమే స్థానికం. అంతేకాకుండా, వాల్ట్ లోపలే ఒక దేశం నిల్వ నుంచి మరొక దేశం నిల్వకు మార్చడం ద్వారా తరలింపు పూర్తవుతుంది. భౌతిక రవాణా అవసరం లేకుండానే దేశాల మధ్య బదిలీ సాధ్యమవుతుంది. ఇది సంక్షోభ కాలంలో కీలక ప్రయోజనం.అనేక దేశాలు తమ బంగార నిల్వలను ఎక్కువ భద్రతా, లిక్విడిటీ ఉన్న ప్రాంతాలకు మార్చుకుంటున్న ధోరణిని కనిపిస్తోంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భౌగోళిక రాజకీయ రిస్కులు పెరిగే కొద్దీ, బంగారం వంటి సంప్రదాయ ఆస్తులపై ఆధారపడటం పెరుగుతుంది. అయితే, ఇటువంటి తరలింపులు ఖర్చు, సమయం, సమన్వయం అవసరమైన క్లిష్టమైన ప్రక్రియలు. భవిష్యత్తులో మరిన్ని కేంద్ర బ్యాంకులు ఇలాంటి జాగ్రత్త చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# కొత్తపల్లిని కరువు మండలంగా ప్రకటించాలి

## -రైతులు, కౌలు రైతులు, కూలీలు, చేతివృత్తిదారులను ఆదుకోవాలి

## -తహసీల్దార్‌కు సీపీఐ, రైతు?వ్యవసాయ కార్మిక సంఘాల వినతి

కొత్తపల్లి, : మండలంలో నెలకొన్న తీవ్ర అనావృష్టి, వర్షాభావ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని కొత్తపల్లి మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, చేతివృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.కొత్తపల్లి సీపీఐ మండల కార్యదర్శి కేతం వెంకటశివుడు యాదవ్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తలారి భీమలింగం, రైతు సంఘం నాయకులు బాలకృష్ణ, తలారి లింగమయ్య మాట్లాడుతూ.. వర్షాభావం కారణంగా పంటలు ఎండిపోతున్నాయని, సాగు చేయలేని పరిస్థితులతో రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. వ్యవసాయంపై ఆధారపడిన కూలీలు, చేతివృత్తిదారులకు కూడా ఉపాధి లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత తీవ్ర వర్షాభావ పరిస్థితులను జాతీయ విపత్తుగా ప్రకటించి రాష్ట్రానికి ప్రత్యేక కరువు సహాయ ప్యాకేజీ విడుదల చేయాలని కోరారు. కరువు మండలంగా ప్రకటించిన ప్రాంతాల్లో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 50 వేల ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పంటల బీమా పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వర్షాభావం కారణంగా పంటలు సాగు చేయలేని రైతులు, కౌలు రైతులకు జీవనోపాధి సహాయం అందించాలన్నారు.2026 నాటికి ఉన్న రైతులు, కౌలు రైతుల పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని, వాస్తవ సాగుదారులైన కౌలు రైతులను గుర్తించి ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, రుణ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇప్పటికే సాగు చేసిన పంటలను కాపాడేందుకు అవసరమైన నీటి రవాణా ఖర్చులను ప్రభుత్వమే భరించాలని తెలిపారు.కరువు ప్రభావిత గ్రామాల్లో పశువులకు ఉచితంగా మేత, తాగునీరు అందించాలని, వలసలను అరికట్టేందుకు ఉపాధి హామీ పనులను పెద్ద ఎత్తున ప్రారంభించి ప్రతి కుటుంబానికి తగినంత పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కార్మికులకు రోజువారీ వేతనం రూ. 700 ఇవ్వాలని కోరారు.కరువు నివారణ చర్యల్లో భాగంగా బియ్యంతో పాటు 16 రకాల నిత్యావసర సరుకులను రేషన్ షాపుల ద్వారా ఉచితంగా అందించాలని, ఇప్పటికే తీసుకున్న రుణాలను రద్దు చేసి జీవనోపాధి పునరుద్ధరణకు సబ్సిడీతో కూడిన రుణాలు అందించాలని కోరారు. కరువు ప్రభావిత మండలాల్లో విద్యార్థుల విద్యా ఫీజులను మాఫీ చేసి, చదువులు మధ్యలో ఆగిపోకుండా ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని తెలిపారు.గ్రామీణ యువతకు స్థానికంగానే ఉపాధి కల్పించేందుకు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, ఆహార శుద్ధి పరిశ్రమలు, చిన్నతరహా గ్రామీణ పరిశ్రమలను ఏర్పాటు చేయాలని నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టి. రమణయ్య, బి. కృష్ణారెడ్డి, పి. మహేష్, పి. నాగిరెడ్డి, గోవిందు రాజు తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పక్కా వ్యూహంతో కాంగ్రెస్

హైదరాబాద్, : తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంచుకునే రాజకీయ వ్యూహాలు ఎప్పుడూ టాప్ లీడర్‌షిప్ నే లక్ష్యంగా చేసుకుంటాయనే విషయం మరోసారి రుజువైంది. గత మూడు రోజులుగా తెలంగాణ శాసనసభ లోపల, బయట చోటుచేసుకున్న రచ్చ, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు, అసెంబ్లీ గేట్ వద్ద పోలీసులతో జరిగిన తోపులాటలు కేవలం కొందరు ఎమ్మెల్యేల తొందరపాటు చర్య కాదని సీఎం రేవంత్ శాసనసభ వేదికగా బాంబు పేల్చారు. ఈ మొత్తం హైడ్రామా వెనుక ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వేదికగా జరిగిన నేరపూరిత కుట్ర ఉందంటూ, నేరుగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌నే సూత్రధారిగా వేలెత్తి చూపడం ద్వారా గులాబీ దళానికి దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు.అసెంబ్లీలో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగం కేవలం ఒక రాజకీయ విమర్శ మాత్రమే కాదు. దానికి పక్కా లీగల్ అండ్ పొలిటికల్ గ్రౌండ్ ప్రిపేర్ చేశారు. సెప్టెంబర్ 6న ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన అంతర్గత సమావేశంలోనే కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల మార్కును, అసెంబ్లీ సమావేశాలను అడ్డుకోవడానికి ప్లాన్ సిద్ధమైందని రేవంత్ ఆరోపించారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న దళిత నేతను ఉద్దేశపూర్వకంగా అవమానించడం, పోలీసుల విధులకు భంగం కలిగించడం వెనుక సభను అస్థిరపరిచే పక్కా వ్యూహం ఉందన్నారు. దీనిని కేవలం సభా నిబంధనల ఉల్లంఘనగా కాకుండా, ఎఖఅ, ఃజూ కింద నేరపూరిత కుట్రగా పరిగణిస్తూ దర్యాప్తుకు ఆదేశించడం కాంగ్రెస్ వేసిన మాస్టర్ స్ట్రోక్. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం లీగల్‌గా సీరియస్‌గా తీసుకుంది. హైదరాబాద్ పోలీస్ జాయింట్ కమిషనర్ నేతృత్వంలో విచారణ జరిపించి, ఫామ్‌హౌస్ సమావేశానికి హాజరైన నేతలు, అక్కడి నుంచి వచ్చిన సూచనలు, అసెంబ్లీ వద్ద జరిగిన భౌతిక దాడుల మధ్య ఉన్న లింకులను టెక్నికల్, ఫోరెన్సిక్ ఆధారాలతో సేకరించాలని ఆదేశించారు. సీనియర్ ఐపీఎస్ పర్యవేక్షణలో జరిగే ఈ కుట్ర కోణం దర్యాప్తు.. రేపు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి, విచారణకు పిలిచే వరకూ వెళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకవేళ కేసీఆర్‌ను లేదా ఆయన ప్రధాన అనుచరులను విచారిస్తే, బీఆర్ఎస్ డిఫెన్స్‌లో పడటం ఖాయం.కాంగ్రెస్ సర్కార్ వేసిన ఈ బిగ్ ట్రాప్ నుంచి బయటపడటం బీఆర్ఎస్‌కు అతిపెద్ద సవాలే. బీఆర్ఎస్ ఇప్పటికే ఈ ఆరోపణలను తిప్పికొట్టేందుకు లీగల్ , విక్టిమ్ కార్డ్‌ను వాడుతోంది. అసెంబ్లీ గేట్ వద్ద మహిళా ఎమ్మెల్యేల పట్ల, సీనియర్ నేతల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై హైకోర్టును, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించి పోలీస్ యంత్రాంగాన్ని రక్షణలో పడేసే ప్రయత్నం చేస్తోంది. రేవంత్ రెడ్డి కావాలనే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ, తమ ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి కేసీఆర్ పేరును లాగుతున్నారని బీఆర్ఎస్ వాదిస్తోంది. రేవంత రెడ్డి ఆడిన ఈ గేమ్‌తో ప్రతిపక్షం అనుకున్న అజెండా పూర్తిగా దారి తప్పింది. కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్యాలు , ఆరు గ్యారెంటీలు అంశాలపై చార్జ్‌షీట్ ద్వారా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని భావించిన బీఆర్ఎస్.. ఇప్పుడు కేసీఆర్ కుట్ర - దళిత స్పీకర్‌కు అవమానం అనే కొత్త కాంగ్రెస్ నెరేటివ్‌ను డిఫెండ్ చేసుకునే పనిలో పడింది.

# కొండా దెబ్బకు రాజ్ గోపల్ రెడ్డి యూ టర్న్..?

హైదరాబాద్, : తెలంగాణ కాంగ్రెస్‌లో ఫైర్ బ్రాండ్ నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తరచుగా మీడియాలో ఉంటున్నారు. తనకు మంత్రి పదవి దక్కలేదని ఆక్రోశిస్తున్న ఆయన.. దానిని ఎలాగైనా సాధించుకునే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. అయితే.. ఈ క్రమంలో ఆయన సామ, దాన, బేధ, దండోపాయాల్లో కుదిరిన సమయం లో కుదిన దానిని వినియోగిస్తున్నారు. నిన్న మొన్నటి వరకు బేధోపాయాన్ని(వైరం) అనుసరించారు. సీఎం రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారుమునుగోడులో సొంత అధికారం చలాయిస్తున్నారు. బెల్టు షాపులు నిర్వహించేది లేదన్నారు బాగానే ఉంది. కానీ.. ప్రభుత్వం ఇచ్చే లైసెన్సులు తెచ్చుకున్న మద్యం దుకాణాలపైనా ఆయన ఆంక్షలు పెట్టారు. అధికారులపై చిందులు తొక్కారు. కానీ, తాజాగా ఇప్పుడు రూటు మార్చేశారు. తాజా మాజీ మంత్రి కొండా సురేఖపై పార్టీ వ్యవహరించిన తీరుతో కంగుతిన్న రాజగోపాల్ రెడ్డి ఏకంగా సామ మార్గం(బుజ్జగించడం)పట్టారు.. అబ్బే నేను సీఎం ను ఏమీ అనలేదని.. అదంతా తనంటే గిట్టని ఓ మీడియా చేసిందని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌తో తనకు ఎప్పుడూ ఎలాంటి పేచీ పంచాయితీలు లేవని కూడా రాజగోపాల్ వ్యాఖ్యానించారు. అంతే కాదు.. రేవంత్ రెడ్డి వంటి బలమైన నాయకుడి కారణంగానే కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిందని.. మళ్లీ మళ్లీ కాంగ్రెస్ అధికారం లోకి వచ్చినా ఆశ్చర్యం లేదన్నారు. ఇక్కడితో కూడా ఆగకుండా.. మునుగోడు నియోజకవర్గానికి 2 వేల



కోట్ల రూపాయల నిధులు కూడా కేటాయించారని.. తద్వారా అభివృద్ధి పనులు కూడా జరుగుతున్నాయన్నారు. కానీ, రెండు మాసాల కిందట తన నియోజకవర్గం పాకిస్థాన్‌లో ఏమైనా ఉందా? అని ఇదే రాజగోపాల్ ప్రశ్నించడం గమనార్హం.ఇక, ఇప్పుడు మరో మాట కూడా చెప్పుకొచ్చారు. త్వరలో జరగబోయే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు తన నియోజకవర్గం నుంచి వేలాది మంది కార్యకర్తలతో తరలివెళతానని రాజగోపాల్ చెప్పడం గమనార్హం. మొత్తంగా కొండా సురేఖ వ్యవహారం తేలిపోయిన దరమిలా.. నిన్న మొన్నటి వరకు ఎగిరి పడిన చాలా మంది నాయకులు లైన్‌లోకి వచ్చేస్తున్నారు. కొందరు ఇంటి నుంచి బయటకు కూడా రాకపోగా.. మరికొందరు మీడియాకు ముఖం చాటేస్తున్నారు. ఈ జాబితాలో ఇప్పుడు కోమటిరెడ్డి చేరిపోయారు. మరి మున్ముందు.. ఈ శాంతి వచనాలు ఇలానే కొనసాగుతాయో లేదో చూడాలి.

# రామప్పను కబళిస్తున్న మైనింగ్

వరంగల్: ములుగు జిల్లాలో ప్రతిపాదించిన ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనుల ప్రాజెక్టుపై స్థానికులు, పర్యావరణవేత్తలు, వారసత్వ పరిరక్షణ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రఖ్యాతి గాంచిన రామప్ప ఆలయంతో పాటు 3 టీఎంసీల సామర్థ్యం ఉన్న రామప్ప చెరువుపై మైనింగ్ ప్రభావం చూపే అవకాశం ఉందని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ అభ్యంతరాల నేపథ్యంలో ములుగు జిల్లా కలెక్టర్ ప్రతిపాదిత ప్రాజెక్టు జియో ట్యాగింగ్ ప్రక్రియను వాయిదా వేశారు. శాస్త్రీయ, పర్యావరణ అధ్యయనాల అనంతరం నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు.యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన తెలంగాణలోని చారిత్రక రామప్ప ఆలయానికి సమీపంలో ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనుల ప్రాజెక్టు మరోసారి చర్చనీయాంశంగా మారింది. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో చేపట్టాలని ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు వల్ల రామప్ప ఆలయంతో పాటు 3 టీఎంసీల సామర్థ్యం ఉన్న రామప్ప చెరువుపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని గ్రామస్తులు, పర్యావరణవేత్తలు, వారసత్వ పరిరక్షణ కార్యకర్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ ప్రాజెక్టుకు సంబంధించి స్థానికులు, పాలంపేట స్పెషల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎస్‌డీఏ) కమిటీ సభ్యులు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ (కేహెచ్‌టీ) ప్రతినిధులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ములుగు జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవ్‌రావు భోర్కడే మంగళవారం ప్రతిపాదిత మైనింగ్ ప్రాజెక్టు జియో ట్యాగింగ్ ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మైనింగ్ ప్రాజెక్టుపై వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్ హేమంత్.. శాస్త్రీయ, పర్యావరణపరమైన అంచనాలు పూర్తి అయిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.ఈ అంశంపై నిర్వహించిన సమావేశాల్లో జిల్లా యంత్రాంగంతో పాటు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్), కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్, పీఎస్‌డీఏ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల రామప్ప ఆలయం , చెరువు, పరిసర గ్రామాలపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశాన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని వారసత్వ పరిరక్షణ వర్గాలు చెబుతున్నాయి. ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌ను కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ కన్వీనర్, మాజీ ప్రొఫెసర్ ఎం. పాండురంగారావు వ్యతిరేకించారు. గనుల తవ్వకాల కోసం బ్లాస్టింగ్, డ్రిల్లింగ్, భారీ యంత్రాల వినియోగం చేపడితే రామప్ప చెరువు నిర్మాణంపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.రామప్ప చెరువుకు సుమారు 3 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉందని.. దాని




నిర్మాణానికి ఏదైనా నష్టం జరిగితే దిగువ ప్రాంతాల్లోని గ్రామాలపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని పాండురంగారావు పేర్కొన్నారు. చెరువుకు సుమారు 5 కిలోమీటర్ల పరిధిలో మైనింగ్ కార్యకలాపాలు చేపట్టడం కూడా పలు ప్రమాదాలకు దారితీయవచ్చని.. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఉపసంహరించుకోవాలని కోరారు.ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రాంతంలో సుమారు 40.4 మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీసేందుకు సింగరేణి గతంలో అనుమతులు పొందినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇందుకోసం 19 ఏళ్ల మైనింగ్ లీజు కూడా పొందినట్లు సమాచారం. ప్రాజెక్టు పరిధిలోని కొంత భూమిని సంస్థ ఇప్పటికే సేకరించి.. భూయజమానులకు పరిహారం చెల్లించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

అయితే ఈ ప్రాజెక్టులో సుమారు 314 హెక్టార్ల అటవీ భూమి.. మరో 1,448 హెక్టార్ల వ్యవసాయ, ప్రభుత్వ అసైన్డ్ భూమి ఉన్నట్లు పేర్కొంటున్నారు. దీంతో మైనింగ్ వల్ల పర్యావరణంతో పాటు స్థానికుల జీవనోపాధిపై కూడా ప్రభావం ఉంటుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు 2021 జూలైకి ముందే సమర్పించగా.. అదే ఏడాది డిసెంబర్‌లో మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభించాలనే ప్రణాళిక ఉన్నట్లు సమాచారం. కానీ.. 2021 జూలై 25వ తేదీన రామప్ప ఆలయానికి యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా లభించింది. దీంతో పాలంపేట, పరిసర గ్రామాల ప్రజలు ఆలయ పరిరక్షణ కోసం సేవ్ రామప్ప ఉద్యమాన్ని ప్రారంభించారు. స్థానికులు, వారసత్వ పరిరక్షణ కార్యకర్తల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో సింగరేణి ఈ ప్రాజెక్టును అప్పట్లో నిలిపివేసినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రాజెక్టును తిరిగి ముందుకు తీసుకెళ్లే అంశంపై చర్చలు మొదలవడంతో పాలంపేట, పరిసర గ్రామాల ప్రజలు మరోసారి ఆందోళనకు సిద్ధమవుతున్నారు. రామప్ప ఆలయం, చెరువు, అటవీ ప్రాంతం, స్థానిక పర్యావరణ వ్యవస్థను కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.

# సోదిలో కనిపించని బీజేపీ...!

హైదరాబాద్: తెలంగాణలో మూడు రోజులుగా జరుగుతున్న పరిణామాలన్నీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య యుద్ధాన్ని సూచిస్తున్నాయి. బీజేపీ ఎక్కడా కనిపించడం లేదు. పార్లమెంట్ ఎన్నికల నాటికి తెలంగాణలో బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ దాదాపు 16-18 శాతానికి పడిపోవడం, కాంగ్రెస్ - బీజేపీ చెరో 8 స్థానాలు గెలుచుకోవడంతో.. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యామ్నాయం తామేనని కమలనాథులు భావించారు. కానీ, గత కొన్ని రోజులుగా అసెంబ్లీ లోపల, బయట చోటుచేసుకున్న హైవోల్టేజ్ పరిణామాలను గమనిస్తే.. తెలంగాణ రాజకీయం మళ్లీ పాత రోజుల్లా కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ గానే మారిపోయింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేస్తున్న రాజకీయ వ్యూహాలు, బీఆర్ఎస్ శ్రేణుల నిరసనలు, అరెస్టులు, కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై దర్యాప్తులు మొత్తం పొలిటికల్ స్పేస్‌ను ఆక్రమించేశాయి. ఈ హోరాహోరీ పోరు మధ్య బీజేపీ తీవ్రంగా వెనుకబడి, రేసులో లేనట్లే కనిపించడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీస్తోంది.పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు జాతీయ అంశాల ప్రాతిపదికన వచ్చినవి తప్ప, స్థానిక రాజకీయాల్లో బీజేపీ బలం పెరిగినట్లు కాదని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణలో క్షేత్రస్థాయి యంత్రాంగం, నిలకడైన కేడర్ ఇప్పటికీ బీఆర్ఎస్ వద్దే ఉంది. శాసనసభ వేదికగా ప్రతిపక్ష పాత్ర పోషించడంలో కేటీఆర్, హరీశ్‌రావు నాయకత్వంలోని గులాబీ దళం దూకుడుగా ముందుకెళ్తోంది. అదే సమయంలో, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికి కాంగ్రెస్‌తో నేరుగా తలపడుతున్నది కూడా బీఆర్ఎస్ మాత్రమే. దీంతో సహజంగానే మీడియా ఫ్రేమ్‌లో, ప్రజల చర్చల్లో బిఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా నిలుస్తోంది.మరోవైపు, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తెలివిగా బీజేపీని రేసులోకి రానివ్వకుండా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. రేవంత్ రెడ్డి టార్గెట్ ఎప్పుడూ కేసీఆర్ మరియు బీఆర్ఎస్ నాయకత్వమే. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలు, శాసనసభలో దళిత స్పీకర్ అవమాన ఉదంతం, ఎర్రవల్లి ఫామ్‌హౌస్ కుట్రలంటూ చర్చ అంతా తమకూ-బీఆర్ఎస్‌కూ మధ్యే పరిమితమయ్యేలా కాంగ్రెస్ నెరేటివ్‌ను సెట్ చేయగలిగింది. కాంగ్రెస్ వ్యూహంలో కేసీఆర్ విలన్‌గా, రేవంత్ నాయకుడిగా కనిపిస్తున్నప్పుడు, మూడో పక్షంగా ఉన్న బీజేపీకి ఎలాంటి పొలిటికల్ స్పేస్ లేదా ప్రాధాన్యత దక్కడం లేదు. ఈ రచ్చ అంతటిలోనూ బీజేపీ సొంతంగా ఒక బలమైన నెరేటివ్‌ను తయారు చేసుకోవడంలో ఘోరంగా విఫలమవుతోంది.ఢిల్లీ నాయకత్వం, లోక్‌సభ విజయాలను మాత్రమే నమ్ముకుంటే స్థానిక రాజకీయాల్లో మనుగడ కష్టమని కమలనాథులు గ్రహించలేకపోతున్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు బీజేపీకి లభించే అవకాశం చాలా పరిమితంగా ఉండటంతో పాటు, వీధుల్లో కాంగ్రెస్‌ను ఢీకొట్టే ఆందోళన కార్యక్రమాలను సృష్టించడంలో పార్టీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. దీంతో బీజేపీ ఇచ్చే నిరసన ప్రకటనలు బీఆర్ఎస్-కాంగ్రెస్ దాడుల ముందు కొట్టుకుపోతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల తదుపరి మైలేజ్‌ను నిలబెట్టుకోవడంలో బీజేపీ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. తెలంగాణ ప్రజల్లో కాంగ్రెస్‌ను ఢీకొట్టగల ఏకైక శక్తి బీఆర్ఎస్ మాత్రమే అనే నమ్మకం మళ్లీ బలపడితే, బీజేపీ సాధించిన 8 లోక్‌సభ సీట్ల విజయం ఒక తాత్కాలిక బబుల్‌గా



మిగిలిపోయే ప్రమాదం ఉంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి బీజేపీ ఇదే రకమైన సైలెంట్ రోల్ పోషిస్తే.. రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్-బీఆర్ఎస్ ద్విముఖ పోరే కంటిన్యూ అవ్వడం ఖాయం.

బ్యాక్ స్టెప్ లోపం..ఎవరిది

తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ స్లో అండ్ స్టడీ విన్స్ ది రేస్ అన్న రీతిలో ముందుకు వెళుతుంది. ఒకవైపు అధికార కాంగ్రెస్ పై బీఆర్ఎస్ దూకుడుతో వెళుతుంటే బీజేపీ మాత్రం నిదానంగా తమ కార్యక్రమాలను చేస్తుంది. తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ స్పీడు ముందు బీజేపీ తేలిపోయిందనే వాదన ప్రస్తుత రాజకీయ సమీకరణాల్లో విస్తృతంగా వినిపిస్తోంది. ముఖ్యంగా 2026 సెప్టెంబర్ నాటి తాజా అసెంబ్లీ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో, రాష్ట్ర రాజకీయం అంతా కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ అన్నట్లుగా మారిపోయింది. అసెంబ్లీ లోపల, వెలుపల బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న తీవ్రమైన పోరాటాలు, ఆందోళనల వల్ల ప్రధాన ప్రతిపక్షంగా తామే ఉన్నామనే సంకేతాన్ని ఆ పార్టీ బలంగా పంపగలుగుతోంద రాష్ట్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు వంటి నేతలు నల్ల టి-షర్టుల నిరసనలు, ధర్నాలతో మీడియా మరియు ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నారు. 20 మందికి పైగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్, ఆ తర్వాతి రాజకీయ హైడ్రామాతో వార్తలన్నీ కాంగ్రెస్-బీఆర్ఎస్ చుట్టూనే తిరుగుతున్నాయి. బీజేపీ సైతం ఫీజు రీయింబర్స్‌మెంట్, 22ం భూముల సమస్యలపై నిరసనలు తెలుపుతున్న ప్పటికీ, బీఆర్ఎస్ స్థాయిలో రాజకీయ మైలేజ్ సాధించలేకపోతోందనే విశ్లేషణలు ఉన్నాయి. అసెంబ్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఉద్దేశపూర్వకంగా ప్రజా సమస్యలను పక్కనబెట్టి రాజకీయ డ్రామాలు ఆడుతున్నాయని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు విమర్శిస్తున్నారు గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ క్షీణించి, బీజేపీ పుంజుకున్నప్పటికీ.. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు నమీపిస్తున్న తరుణంలో బీఆర్ఎన్ తన పట్టును నిరూపించుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తోంది. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనని నిరూపించే క్రమంలో బీఆర్ఎస్ చూపిస్తున్న దూకుడు ముందు బీజేపీ రేసులో కాస్త వెనుకబడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మళ్లీ పుంజుకోవడానికి బీజేపీ తన వ్యూహాలకు పదును పెడుతోంది. అయితే బీజేపీ ఎన్నికల వ్యూహం ముందు రానున్న కాలంలో బీఆర్ఎస్ ఎంత మేరకు నిలబడుతుందన్నది ప్రశ్నార్థకమే అయినప్పటికీ ప్రస్తుతానికి మాత్రం బీఆర్ఎస్ స్పీడ్ ను బీజేపీ అందుకోలేకపోతుందన్నది నిజం.

# మూడు హ్యామ్ రోడ్డు పనులకు శ్రీకారం



మహబూబ్ నగర్, : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో మూడు హ్యామ్ రోడ్డు పనులకు మంత్రులు సీతక్క, జూపల్లి శంకుస్థాపన చేశారు. పెద్దకొత్తపల్లి, పాన్‌గల్, వీపనగండ్ల మండలాల్లో మొత్తం 19.35 కిలోమీటర్ల మేర రహదారులను రూ.15.87 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్నారు. పెద్దకొత్తపల్లి మండలంలో 6.95 కిలోమీటర్లు, పాన్‌గల్‌లో 4.40 కిలోమీటర్లు, వీపనగండ్లలో 8 కిలోమీటర్ల రహదారులు నిర్మించనున్నారు. ఈ రహదారులతో గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి.నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో రహదారి మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. పెద్దకొత్తపల్లి మండలంతో పాటు పరిసర ప్రాంతాల్లో రూ.15.87 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మూడు హ్యామ్ రోడ్డు పనులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు. శనివారం నక్కలపల్లి స్టేజ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.మూడు రహదారి పనుల ద్వారా మొత్తం 19.35 కిలోమీటర్ల మేర రోడ్లను అభివృద్ధి చేయనున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం, మండల కేంద్రాలు, ప్రధాన రహదారులతో గ్రామాలకు అనుసంధానం పెంచడం, ప్రజల ప్రయాణ సమయాన్ని తగ్గించడం వంటి లక్ష్యాలతో ఈ పనులను చేపడుతున్నారు. హ్యామ్ విధానంలో చేపట్టే ఈ రహదారి పనులు పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. పెద్దకొత్తపల్లి మండలం బండారపాకుల వద్ద పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి జెడ్పీ రోడ్డు వరకు నక్కలపల్లి, వెంకటచెర్ల మీదుగా 6.95 కిలోమీటర్ల మేర రహదారిని నిర్మించనున్నారు. ఈ పనులకు సుమారు రూ.5.70 కోట్లు కేటాయించారు. ఈ రహదారి ద్వారా మండలంలోని పలు గ్రామాలకు మెరుగైన రాకపోకలు అందుబాటులోకి రానున్నాయి.పాన్‌గల్ మండలంలో బండపల్లి మీదుగా పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి జమ్మాపూర్ వరకు 4.40 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి సుమారు రూ.3.61 కోట్లు మంజూరు చేశారు. ఈ రహదారి పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రధాన రహదారులకు రాకపోకలు సులభతరం కానున్నాయి. వీపనగండ్ల మండలంలో కొర్లకుంట ఎక్స్ రోడ్డు నుంచి తూముకుంట?బొల్లారం ఎక్స్ రోడ్డు వరకు 8 కిలోమీటర్ల మేర రహదారిని నిర్మించనున్నారు. ఈ పనులకు రూ.6.56 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ మూడు రోడ్లకు కలిపి రూ.15.87 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన రహదారులు అందుబాటులోకి రావడం వల్ల వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, విద్య, వైద్యం, ఉపాధి అవసరాల కోసం ప్రజల ప్రయాణాలు సులభతరం కానున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యే ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి ప్రజలకు కీలకంగా మారనుంది. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు మంత్రులు సూచించారు.

# అసెంబ్లీలో రోజుకు రూ.8?12 లక్షల ఖర్చు

హైదరాబాద్, : తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు.. 6 రోజులు నిర్వహించాలని నిర్ణయించారు. అంటే.. ఈ గురు, శుక్ర, శనివారంతో ఈ సభలకు ముగింపు పలకనున్నారు. కీలకమైన బిల్లులను ఈ సభలో ప్రవేశ పెట్టి ఆమోదించుకోవాలని ప్రభుత్వం పక్షం నిర్ణయించుకుంది. అలాగే.. వెయ్యిరోజుల పాలన పై కూడా చర్చించి.. ప్రజలకు ఏయే మేళ్లు చేశారు.. ఏమేరకు రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారు.. అనే విషయాలను కూడా వివరించాలని నిర్ణయించారు. అజెండాలోనూ వీటిని పేర్కొన్నారు.ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ విషయానికి వస్తే.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను.. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, హైడ్రా కమిషనర్ వ్యవహారం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, ఎల్ నినో ప్రభా వం సహా.. ఇతర అంశాలను కూడా ప్రస్తావించాలని నిర్ణయించుకుంది. తద్వారా ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని తొలుత నిర్ణయించింది. కానీ, అనూహ్యంగా అసెంబ్లీ వాతావరణమే మారిపోయింది. మూడు రోజుల అసెంబ్లీలో ఒక్కటంటే ఒక్క సమస్య కూడా ప్రస్తావనకురాలేదు. అటు అధికార పక్షం, ఇటు ప్రధాన ప్రతిపక్షాలు ఒకరిపై ఒకరు నిప్పులు చెరుగు కోవడమే సరిపోయింది. అసెంబ్లీ తొలి రోజు సోమవారం.. వెయ్యి రోజుల పాలనలో ఏమీ జరగలేదని చెబుతూ.. నల్ల టీషర్టులు ధరించి నిరసన వ్యక్తం చేయడం నుంచి స్పీకర్‌పై బీఆర్ ఎస్ ఎమ్మెల్సీలు.. చేసిన వ్యాఖ్యలు సభను కుదిపి వేశాయి. పోనీ రెండో రోజైనా సర్దుకున్నాయా? అంటే.. లేదు. ఎమ్మెల్సీల వ్యవహారం.. ఇరుపక్షాల మాటల దాడితోనే సభా సమయం కరిగిపోయింది బీఆర్ ఎస్ ఎమ్మెల్యేల పై కాంగ్రెస్ పార్టీ, కాదు.. మీరే మమ్మల్ని అవమానించారని.. మహిళలపైనా దాడులు చేశారని బీఆర్ ఎస్ నేతలు యుద్ధాన్ని తలపించేలా సభలో వాగ్యుద్ధం చేసుకున్నారు. ఫలితంగా.. సభలో రభస తప్ప.. మరేమీ కనిపించలేదు. రోజుకు 8- 12 లక్షల రూపాయల మేరకు ఖర్చు చేస్తున్న సభలో ఒక్క ప్రజా సమస్యపైనా.. నాయకులు నోరు విప్పకపోవడం గమనార్హం. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న ఎల్ నినో.. రాజధానిలో అడుగంటుతున్న శాంతి భద్రతలు..(డీజీపీ ఆనందే వెల్లడించారు) వంటి అంశాలపై ఒక్కరు సైతం మాట్లాడకపోవడం గమనార్హం. మరి రభస ఎవరి కోసం.. రేపు సభ అయిపోయిన తర్వాత.. ఎవరి మానాన వారు తమ తమ పనుల్లో ఉంటారు. మరి ప్రజా సమస్యలపై చర్చించేది ఎప్పుడు? అనేది ధర్మసందేహం.!

# కోకాపేట రియల్ ఎస్టేట్ అంతలో ఎంత మార్పు.. రివర్స్ గేర్...




హైదరాబాద్, : కోకాపేట నియోపొలిస్‌లో 4.59 ఎకరాల ప్లాట్‌కు హెచ్ఎండీఏ నిర్వహించిన ఆన్‌లైన్ వేలానికి ఆశించిన స్పందన రాలేదు. కేవలం ఒక్క బిడ్ దాఖలవడంతో ఎకరాకు రూ.120 కోట్ల కనీస ధరకే ప్లాటు అమ్ముడుపోయింది. గత వేలంలో ఇదే భూమికి ఎకరాకు రూ.136 కోట్లు పలికినా.. బిడ్డర్ గడువులోపు డబ్బు చెల్లించకపోవడంతోమళ్లీ వేలం నిర్వహించారు. మరోవైపు గోల్డెన్ మైల్‌లోని 0.70 ఎకరాల ప్లాటుకు మాత్రం పోటీ పెరిగి ఎకరాకు రూ.115 కోట్ల అత్యధిక బిడ్ నమోదైంది.హైదరాబాద్‌లో అత్యంత విలువైన కోకాపేట భూముల ఆన్‌లైన్ వేలం హెచ్ఎండీఏకు నిరాశను కలిగించింది. ఆశించిన స్థాయిలో ఆదాయాన్ని అందించలేకపోయింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేట నియోపొలిస్‌లోని సర్వే నంబర్లు 239, 240లో 4.59 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్లాట్ నంబర్ 17కు బుధవారం నిర్వహించిన వేలంలో కేవలం ఒక్క బిడ్ మాత్రమే దాఖలైంది. దీంతో పోటీ లేకపోవడంతో కనీస ధర అయిన ఎకరాకు రూ.120 కోట్లకే ప్లాటు దక్కింది. ఈ ప్లాటు ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.550.8 కోట్ల ఆదాయం సమకూరనుంది. అయితే గతంలో ఇదే ప్లాటుకు నిర్వహించిన వేలంలో ఎకరాకు రూ.136 కోట్ల ధర పలికింది. అత్యధిక ధరకు బిడ్ దాఖలు చేసిన సంస్థ గడువులోగా నిర్ణీత మొత్తాన్ని చెల్లించకపోవడంతో ఆ లావాదేవీ నిలిచిపోయింది. దీంతో హెచ్ఎండీఏ తాజాగా మరోసారి వేలం నిర్వహించింది. ఈసారి పోటీ బిడ్లు లేకపోవడంతో గతంలో నమోదైన ధరతో పోలిస్తే తక్కువ మొత్తానికే భూమి అమ్ముడుపోయింది.కోకాపేటకు సమీపంలోని గోల్డెన్ మైల్ సైట్-1లో 0.70 ఎకరాల భూమికి మాత్రం వేలంలో మంచి స్పందన లభించింది. సర్వే నంబర్ 109లోని ఈ ప్లాటుకు హెచ్ఎండీఏ కనీస ధరను ఎకరాకు రూ.70 కోట్లుగా నిర్ణయించింది. అయితే వేలంలో పోటీ పెరగడంతో అత్యధిక బిడ్ ఎకరాకు రూ.115 కోట్లకు చేరింది. దీంతో ఈ ప్లాటుకు నిర్ణయించిన కనీస ధర కంటే గణనీయంగా ఎక్కువ ధరకు అమ్ముడుపోయింది.

ఒకే ప్రాంతంలో ఉన్న భూములకు వేలంలో భిన్నమైన స్పందన రావడం ఆసక్తికరంగా మారింది. కోకాపేట నియోపొలిస్‌లోని భారీ ప్లాటుకు ఒక్క బిడ్ మాత్రమే రావడం, గోల్డెన్ మైల్ ప్లాటుకు మాత్రం పోటీ నెలకొనడం మార్కెట్ పరిస్థితులపై చర్చకు దారితీసింది.ఈ రెండు ప్లాట్లు కోకాపేటలో వ్యూహాత్మక ప్రదేశాల్లో ఉన్నాయని హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి, హైటెక్‌సిటీ ప్రాంతాలకు వీటికి మెరుగైన రహదారి అనుసంధానం ఉందని చెప్పారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న పశ్చిమ హైదరాబాద్‌లో కోకాపేట కీలక వాణిజ్య, నివాస కేంద్రంగా ఎదుగుతున్న నేపథ్యంలో ఇక్కడి భూములకు భారీ డిమాండ్ ఉందని అన్నారు. అయితే తాజా వేలంలో నియోపొలిస్ ప్లాటుకు గత వేలంతో పోలిస్తే తక్కువ ధర రావడం హెచ్ఎండీఏను నిరాశ పరిచింది

# పట్టాలపై నడిచే ఫైవ్ స్టార్ హోటల్

**హైదరాబాద్, :** మనదేశంలో అత్యంత చవకైన రవాణా వ్యవస్థగా రైల్వే శాఖకు పేరు ఉంది. ఆంగ్లేయుల కాలం నుంచి మనదేశంలో రైల్వే వ్యవస్థ ఏర్పాటు అయింది. అప్పటినుంచి దినదిన ప్రవర్ధమానంగా ఎదుగుతుంది. ప్రతి ఏడాది ప్రయాణికులు పెరుగుతూ ఉండడం.. ప్రయాణికులు ప్రీమియం సౌకర్యాలు కోరుకుంటున్న నేపథ్యంలో.. రైల్వే శాఖ వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టింది. మొన్నటిదాకా వందే భారత్ రైళ్లలో స్లీపర్ కోచ్ లు అందుబాటులో ఉండేవి కాదు.

ప్రయాణికుల నుంచి విజ్ఞప్తులు పెరిగిపోవడంతో రైల్వే శాఖ భారీగా వెచ్చించి.. సుదూర రాత్రి ప్రయాణాల కోసం వందే భారత్ స్లీపర్ కోచ్ లు అందుబాటులోకి తీసుకొచ్చింది. కొత్త వెర్షన్లో ప్రయాణికులకు అత్యద్భుతమైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేసాయి. ఒక రకంగా స్లీపర్ కోచ్ లను పట్టాల మీద నడిచే ఫైవ్ స్టార్ హోటల్ అని చెప్పవచ్చు.వందే భారత్ స్లీపర్ కోచ్ కు సంబంధించి ఒక వీడియో సోషల్ మీడియాలో బయటికి వచ్చింది. అందులో ఉన్న సౌకర్యాలు చూసి చాలామంది ఆశ్చర్యపోతున్నారు. ఇది ఒక లగ్జరీ హోటల్ లాగా ఉందని.. అద్భుతమైన సౌకర్యాలు ఇందులో ఉన్నాయని వ్యాఖ్యానిస్తున్నారు . ఆ వీడియోలో ఉన్న దృశ్యాలను చూస్తుంటే ప్రయాణికుల కోసం ప్రత్యేకమైన.. ప్రైవేట్ క్యాబిన్ ఉంది.

# ఎలాబడితే అలా తినడం కాదు...



అరటిపండులో పోషకాలు మెండుగా ఉన్నాయి.. అందుకే.. అరటిపండును సూపర్ ఫుడ్‌గా పేర్కొంటారు. ఇది ఏడాది పొడవునా లభిస్తుంది.. ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. పిల్లలు, పెద్దలు అరటిపండ్లను ఇష్టంగా తింటారు. అయితే.. ఎల్లప్పుడూ అరటిపండ్లు తినడం ఆరోగ్యానికి హానికరమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అరటిపండులో పోషకాలు మెండుగా ఉన్నాయి.. అందుకే.. అరటిపండును సూపర్ ఫుడ్‌గా పేర్కొంటారు. ఇది ఏడాది పొడవునా లభిస్తుంది.. ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. పిల్లలు, పెద్దలు అరటిపండ్లను ఇష్టంగా తింటారు. అయితే.. ఎల్లప్పుడూ అరటిపండ్లు తినడం ఆరోగ్యానికి హానికరమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అందువల్ల, అరటిపండ్లు ఎప్పుడు తినాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. చాలా మందికి అరటిపండ్లు ఎప్పుడు తినాలో తెలియదు. అరటిపండులో ఇందులో పొటాషియం.. విటమిన్ ః6, విటమిన్ అ, ఫైబర్, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. ఒక మీడియం అరటిపండులో సుమారు 100-110 కేలరీలు, 93శాతం కార్బోహైడ్రేట్లు ఉంటాయని డైటీషియన్లు చెబుతున్నారు. అల్పాహారంతోపాటు: ఖాళీ కడుపుతో కంటే ఓట్స్, గంజి లేదా పాలతో అరటిపండు తినడం మంచిది. దీనిలోని ఫైబర్ మిమ్మల్ని ఎక్కువసేపు కడుపు నిండి ఉండేలా చేస్తుంది.. ఇది మీ జీవక్రియను పెంచుతుంది.వ్యాయామానికి ముందు: వ్యాయామానికి 30 నిమిషాల ముందు అరటిపండు తినడం.. ద్వారా తక్షణ శక్తిని పెంచుతుంది. ఇది కండరాల తిమ్మిరిని నివారిస్తుంది.సాయంత్రం స్నాక్‌లా: భోజనం, రాత్రి భోజనం మధ్య ఆకలి తగ్గినప్పుడు అరటిపండ్లు ఆరోగ్యకరమైన ఎంపిక. అవి జంక్ ఫుడ్ కోరికలను తగ్గించడంలో సహాయపడతాయి. ఖాళీ కడుపుతో: ఇందులో అధిక మొత్తంలో మెగ్నీషియం ఉంటుంది.. ఖాళీ కడుపుతో దీనిని తీసుకోవడం వల్ల రక్తంలో కాల్షియం-మెగ్నీషియం సమతుల్యత దెబ్బతింటుంది. రాత్రిపూట: అరటిపండ్లు చల్లదనాన్ని కలిగి ఉంటాయి. ఇది కఫం, దగ్గు లేదా జలుబు సమస్యను పెంచుతుంది.పడుకునే ముందు: ఇది జీర్ణం కావడానికి కష్టంగా ఉంటుంది. కడుపులో భారమైన అనుభూతిని కలిగిస్తుంది. శక్తిని పెంచుతుంది: అరటిపండ్లలో కార్బోహైడ్రేట్లు, సహజ చక్కెరలు (సుక్రోజ్, ఫ్రక్టోజ్ మరియు గ్లూకోజ్) సమృద్ధిగా ఉంటాయి. అందుకే అథ్లెట్లు వ్యాయామానికి ముందు లేదా తర్వాత అరటిపండ్లు తినడానికి ఇష్టపడతారు.

# పాలతో వీటిని కలుపుకొని తాగితేదిమ్మతిరిగే ప్రయోజనాలు



పాలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తాగడం వల్ల మనకు అనేక ప్రయోజనాలు ఉన్నాయి. పాలలో కాల్షియం, ప్రోటీన్, విటమిన్ డి, విటమిన్ బి12, పొటాషియం, భాస్వరం వంటి అనేక పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి మనకు శక్తిని అందించేందుకు దోహదపడుతాయి. అయితే పాలలో కొన్ని పదార్థాలను కలిపి తీసుకోవడం వల్ల మీరు రెట్టింపు శక్తిని పొందవచ్చు. జిమ్‌కు వెళ్లే వాళ్లు శక్తినికి పెంచుకోవాలనుకునే వారికి ఇది ఉత్తమం ఉండొచ్చు. కాబట్టి పాలలో కలపుకొని తీసుకోవాల్సి ఆహారాలు ఏవో తెలుసుకుందాం పదండి. పాలు మన రోజువారీ ఆహారంలో కీలక పాత్రను పోషిస్తాయి.

# రోజులో ఒక వ్యక్తి ఎంత నెయ్యి తీసుకోవాలి?



గురుగ్రామ్‌లోని మేదాంత హాస్పిటల్‌లోని ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ డాక్టర్ ప్రవీణ్ చంద్ర ఇటీవలి ఇంటర్వ్యూలో, భారతీయులు ఎంత నెయ్యి, ఎంత నూనె తీసుకోవాలో వివరించారు. అలాగే గుండె ఆరోగ్యానికి మంచిదా కాదా అని కూడా వెల్లడించారు. నెయ్యి, నూనె లేకుండా భారతీయ ఆహారం అసంపూర్ణంగా భావిస్తారు. ఈ రెండూ భారతీయ ఆహారంలో అత్యంత ముఖ్యమైన భాగాలుగా పరిగణిస్తారు. భారతీయ వంటశాలలలో నెయ్యి, నూనె రెండూ మూడు భోజనాలలో ఉపయోగిస్తారు. ప్రతి ఇంట్లో వంట కోసం నూనెను ఉపయోగిస్తారు. రోటీ, కూరగాయలు, పప్పులకు కూడా నెయ్యిని కలుపుతారు. కొంతకాలం పాటు వాణిజ్య నెయ్యిని హానికరమని ప్రజలు భావిస్తారు. కానీ ఇంట్లో తయారుచేసిన దేశీ నెయ్యి చాలా ఆరోగ్యకరమైనదని ప్రజలు భావిస్తారు. దానిని వారి ఆహారంలో విస్తృతంగా ఉపయోగిస్తారు. గురుగ్రామ్‌లోని మేదాంత హాస్పిటల్‌లోని ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ డాక్టర్ ప్రవీణ్ చంద్ర ఇటీవలి ఇంటర్వ్యూలో, భారతీయులు ఎంత నెయ్యి, ఎంత నూనె తీసుకోవాలో వివరించారు. అలాగే గుండె ఆరోగ్యానికి మంచిదా కాదా అని కూడా వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన నెయ్యి, నూనె పరిమాణం గురించి చర్చించారు. సాధారణంగా భారతీయ సాంప్రదాయంలో నెయ్యి, నూనెలను ఎక్కువగా తీసుకుంటారని, పుట్టినరోజు, వివాహం లేదా ఒక కార్యక్రమాల్లో వీటి వాడకం ఎక్కువగా ఉంటుందన్నారు. గతంలో ప్రత్యేక సందర్భాలలో సంవత్సరానికి ఐదు నుండి ఆరు సార్లు మాత్రమే వేయించిన ఆహారాన్ని తినేవారు. ఇతర రోజులలో, ప్రజలు సాత్విక లేదా పచ్చి ఆహారాన్ని తినేవారు. నెయ్యి, నూనెలను ఎక్కువగా తీసుకోవడం వల్ల గుండె జబ్బులు పెరిగిపోయాయని అన్నారు.దేశీ నెయ్యి, కూరగాయల నూనె మంచివని, కానీ అవి హైడ్రోజనేటెడ్ కాకపోతే మాత్రమే అని డాక్టర్ వివరించారు. ఏదైనా నూనెను హైడ్రోజనేషన్ చేయడం వల్ల ధాన్యంలా, తెల్లగా మారుతుంది. ఇది అనారోగ్యకరమైనది. డాక్టర్ ప్రవీణ్ చంద్ర ప్రకారం, మీరు రోజంతా 1 నుండి 2 టీస్పూన్ల నెయ్యిని తీసుకోవచ్చు. ఉదాహరణకు ఒక టీస్పూన్ నెయ్యి, ఒక టీస్పూన్ నూనె. కూరగాయల నూనెలు ఆరోగ్యకరమైనవిగా పరిగణిస్తారు. కానీ జంతువుల కొవ్వుతో తయారు చేసిన నూనెలు హానికరమైనవి. ఎందుకంటే అవి అధిక మొత్తంలో సంతృప్త కొవ్వును కలిగి ఉంటాయి. చెడు కొలెస్ట్రాల్‌ను పెంచే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని తెలిపారు.

# తులసి.. ప్రకృతి ప్రసాదించిన అద్భుతవరం



తులసి మొక్క.. దాని ఆకులు, కాండం, వేరు భాగాలతో సహా ఎన్నో ఔషధ గుణాలను కలిగి ఉంది. ఇది కేవలం ఒక మొక్క మాత్రమే కాదు, మన ఆరోగ్యానికి ఒక వరం. తులసి ఒక అడాప్టోజెన్ వలె పనిచేస్తుంది. ఇది శరీరాన్ని ఒత్తిడికి అనుగుణంగా మార్చుకోవడానికి.. మానసిక సమతుల్యతను ప్రోత్సహించడానికి సహాయపడుతుంది. తులసి మొక్కలో పోషకాలతోపాటు అపారమైన ఔషధ గుణాలు దాగున్నాయి.. హిందూ సంస్కృతిలో పవిత్రమైనదిగా పూజిస్తారు. తులసి ఆకులు, కాండం, వేరుతో సహా అన్ని భాగాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. తులసిని అడాప్టోజెన్‌గా పరిగణిస్తారు.. ఇది మీ శరీరం ఒత్తిడికి అనుగుణంగా, మానసిక సమతుల్యతను ప్రోత్సహించే ఒక సహజ పదార్థం. శరీరం సాధారణ స్థితికి తీసుకు రావడానికి సహాయపడే ప్రత్యేకమైన మూలికల మొక్కగా అభివర్ణిస్తారు.. ఆధునిక జీవనశైలిలో పెరిగిన ఒత్తిడిని తగ్గించడంలో ఇది చాలా సహాయపడుతుంది. అందుకే.. దీనిని ఔషధ గుణాలకు నిలయంగా పేర్కొంటారు.. ఉదయాన్నే తులసి ఆకులు రెండు తిన్నా.. టి లేదా కషాయం తాగినా మంచిదని చెబుతున్నారు ఆయుర్వేద నిపుణులు.. తులసిలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని నిర్విషీకరణ చేసి, హానికరమైన విష రసాయనాల నుండి రక్షిస్తాయి. కొన్ని పరిశోధనల ప్రకారం.. తులసి క్యాన్సర్ కణాల పెరుగుదలను తగ్గించడం ద్వారా క్యాన్సర్‌ను నివారించడంలో సహాయపడుతుంది. తులసి సారం గాయాలను వేగంగా నయం చేయగలదని, వాటి బలాన్ని పెంచుతుందని భావిస్తున్నారు. యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్, శోధ నిరోధక, అనాల్జెసిక్ (నొప్పి నివారణ) లక్షణాలతో, ఇది అంటువ్యాధులకు, గాయాలకు వ్యతిరేకంగా సమర్థవంతంగా పోరాడుతుంది. నోటి పూతలు, కెలాయిడ్లు, పెరిగిన మచ్చలు, మొటిమలను కూడా నివారించడంలో తులసి తోడ్పడుతుంది. రక్తంలో చక్కెర నియంత్రణలో తులసి కీలక పాత్ర పోషిస్తుంది. ప్రీ-డయాబెటిస్ లేదా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి, తులసి మొక్కలోని పదార్థాలు రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. ఇది బరువు పెరుగుట, అధిక ఇన్సులిన్, అధిక కొలెస్ట్రాల్, ఇన్సులిన్ నిరోధకత, రక్తపోటును తగ్గించడంలో కూడా దోహదపడుతుంది. తులసి జీవక్రియ ఒత్తిడిని లక్ష్యంగా చేసుకుంటుంది.. తద్వారా బరువు తగ్గడానికి, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి సహాయపడుతుంది. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడం ద్వారా హృదయ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. తులసిలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు ఒత్తిడి, ఆందోళన, మంటను ఎదుర్కోవడానికి సహాయపడతాయి. ఆర్థరైటిస్ లేదా ఫైబ్రోమయాల్జియా వంటి కీళ్ల నొప్పులతో బాధపడేవారికి ఇది ఉపశమనం కలిగిస్తుంది. తులసి కడుపుకు సహజ రక్షణను అందిస్తుంది, ఆమ్లత్వాన్ని తగ్గించి, శ్లేష్మ స్రావాన్ని పెంచుతుంది. ఇది గుండెపోటు, స్ట్రోక్ వంటి సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఆస్తమా, బ్రాంకైటిస్, జలుబు, దగ్గు, ఫ్లూ, గొంతు నొప్పి వంటి శ్వాసకోశ వ్యాధుల నుండి ఉపశమనం పొందడంలో తులసి అద్భుతంగా పనిచేస్తుంది. రెగ్యులర్ తులసి వినియోగం తలనొప్పి నుండి ఉపశమనం, ఆందోళన, నిరాశ తగ్గింపు, మంచి నిద్రకు దారితీస్తుంది. అజీర్ణం, పేగు పరాన్నజీవులు, అల్సర్లు, వాంతులు, ఇతర గ్యాస్ట్రిక్ సమస్యలకు చికిత్స చేయడానికి కూడా తులసిని ఉపయోగిస్తారు. మూత్రపిండాల్లో రాళ్ల నొప్పిని తగ్గించడంలో, వాటిని నివారించడంలో ఇది సహాయపడుతుంది.

# ఇలా కూడా సంతోషంగా జీవించవచ్చు....



కన్నడ,తమిళ చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి రమ్య, గత కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్నారు. 43 ఏళ్ల వయసొచ్చినా పెళ్లి చేసుకోకపోవడంపై నిత్యం పలు ప్రశ్నలు ఎదురవుతుండగా.. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో ఆమె ఈ విషయంపై రియాక్ట్ అయ్యారు. పెళ్లి చేసుకోవడం జీవితంలో అంత ముఖ్యమా అని ప్రశ్నించిన ఆమె, అది తన వ్యక్తిత్వాన్ని ఎప్పటికీ నిర్వచించలేదని స్పష్టం చేశారు. అలాగే పెళ్లి చేసుకోకుండా ఆనందంగా జీవించవచ్చని అన్నారు. సంతోషంగా ఉండటమే అత్యంత ముఖ్యమని, సమాజం ఒత్తిడి తెచ్చినా మీకు ఏది కావాలో మీరే ఎంచుకోవాలని సూచించారు. అయితే తాను పెళ్లికి వ్యతిరేకం కాదన్న రమ్య.. ఇద్దరి మధ్య మంచి స్నేహం, ఒకే రకమైన విలువలు, పరస్పర అవగాహన ఉంటే వివాహ బంధం అందంగా మారుతుందని చెప్పారు. మనుషుల్లో వచ్చే మార్పుల వల్లే సమస్యలు వస్తాయని, మంచి స్నేహితులైతే పెళ్లి చేసుకోవడం మంచి ఆలోచన అని తెలిపారు. కేవలం సామాజిక ఒత్తిడి వల్ల మాత్రం ఎవరూ పెళ్లి చేసుకోకూడదని సలహా ఇచ్చారు. ఇక పెళ్లి చేసుకోవడానికి ఎవరైనా దొరికారా అనే ప్రశ్నకు బదులిస్తూ.. తనకు ఇంకా అలాంటి సరైన వ్యక్తి దొరకలేదని, ప్రస్తుతం తాను ఆ ప్రయత్నం కూడా చేయడం లేదని, పూర్తిగా పనితో బిజీగా ఉన్నానని రమ్య తేల్చిచెప్పారు. ఇక రమ్య కామెంట్స్‌పై కొందరు విమర్శలు చేస్తుండగా.. మరికొందరు మాత్రం ఆమె చెప్పింది నిజమని అంటున్నారు.

# ఆ ఆనందం కోసం ఎదురు చూస్తున్నా...

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ఇటీవల 'మా ఇంటి బంగారం' మూవీతో బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ప్రస్తుతం ఆమె గర్భవతిగా ఉండటంతో కొద్దికాలం పాటు సినిమాలకు దూరంగా ఉంటూ పూర్తిగా విశ్రాంతి తీసుకుంటున్నారు. అయినప్పటికీ సోషల్ మీడియాలో నిత్యం ఫుల్ యాక్టివ్‌గా ఉంటున్న ఆమె,
తన బేబీ బంప్ ఫొటోలతో పాటు వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడియాలో టచ్‌లోనే ఉంటున్నారు.
ఇదిలా ఉంటే.. తాజాగా, ఈ టాలెంటెడ్ బ్యూటీ ప్రముఖ జాతీయ మీడియా సంస్థ అయిన 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' మ్యాగజైన్ కవర్ పేజీపై చోటు దక్కించు కుని హాట్ టాపిక్‌గా నిలిచారు. ఈ సందర్భంగా.. తన వ్యక్తిగత జీవితంలో రాబోతున్న సరికొత్త మార్పులు, మాతృత్వపు అద్భుతమైన అనుభూతుల గురించి ఆమె మనసు విప్పి మాట్లాడారు. తన జీవితం పూర్తిగా మారిపోవడానికి, సరికొత్త బాధ్యతలను స్వీకరించడానికి తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని సమంత స్పష్టం చేశారు. తన రాబోయే బేబీ బంగారం కోసం ఎంతో ఆతృతగా, ఆనందంగా ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్న ఆమె, జీవితంలో మొదలుకాబోతున్న ఈ కొత్త అధ్యాయాన్ని ఎంతో సానుకూలంగా స్వాగతించేందుకు సిద్ధంగా ఉన్నాననే భావాన్ని అందరితో పంచుకున్నారు.



# సూర్యా 47 అదిరిపోయే టైటిల్ ఫిక్స్

ఇటీవల వచ్చిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న కోలీవుడ్ స్టార్ హీరో సూర్.. ఇప్పుడు తన తదుపరి చిత్రం నుంచి అదిరిపోయే అప్డేట్ ఇచ్చి ఫ్యాన్స్‌ను ఆశ్చర్యపరిచాడు. సూర్య ప్రధాన పాత్రలో, 'ఆవేశం' లాంటి బ్లాక్ బస్టర్ చిత్రాన్ని అందించిన జీతూ మాధవన్ దర్శకత్వంలో రాబోతున్న క్రేజీ పాజెక్టు 'సూర్యా 47'. తాజాగా ఈ మూవీ టైటిల్ రివీల్ చేస్తూ పవర్ ఫుల్ టీజర్‌తో పాటు అదిరిపోయే పోస్టర్‌ను వదిలారు. అయితే.. గతకొద్ది రోజులుగా ఈ సినిమాకు 'సీన్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు నెట్టింట పుకార్లు షికార్లు చేసిన విషయం తెలిసిందే. అభిమానుల్లో నెలకొన్న క్యూరియాసిటీకి చెక్ పెడుతూ.. ఈ చిత్రానికి ముందుగా ఊహించినట్లే 'సీన్ (ఆఇవనివ)' అనే టైటిల్‌ను ఫైనల్ చేశారు. ఇక రిలీజ్ చేసిన టైటిల్ టీజర్‌లో షార్ట్ అండ్ టీ షర్ట్‌లో నయా మేకోవర్‌లో కనిపిస్తూ స్టైలిష్ ఎంట్రీతో అదరగొట్టాడు సూర్య. పోలీసాఫీసర్ భుజంపై చేయి వేసి జైలులో ఖైదీల మధ్య నుంచి నడుచుకుంటూ వస్తోన్న సీన్ ఫ్యాన్స్‌లో గూస్ బంప్స్ తెప్పిస్తుంది. ఇక ఈ టీజర్‌తో 'సీన్' సినిమాలో సూర్యలోని నయా యాంగిల్‌నుచూపించబోతున్నట్టు హిట్ ఇచ్చేశారు మేకర్స్. కాగా.. ఈ మూవీలో సూర్యకు జోడీగా నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, 'ప్రేమలు' ఫేమ్ మలయాళ నటుడు నస్లెన్ కీలక పాత్రలో పోషిస్తున్నాడు. మలయాళ సంగీత దర్శకుడు సుశిన్ శ్యామ్ మ్యూజిక్ అందిస్తున్నాడు. దీపావళి కానుకగా నవంబర్ 6, 2026న థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.




# 15 ఏళ్ళ నా కల నెరవేరింది...



తెలుగు ప్రేక్షకులను అలరించేలా విభిన్నమైన, ఆసక్తికరమైన కథాంశాలతో ముందుకు సాగుతున్న జీ5 మరో ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్‌ను అందుబాటులోకి తీసుకురాబోతుంది. అదే 'పంచనామా' సిరీస్. నటుడు భరత్ శ్రీనివాసన్ ప్రధాన పాత్రలో నటించిన ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ జీ5లో స్ట్రీమింగ్ కాబోతుంది. మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌లో 6 ఎపిసోడ్స్ ఉంటాయి. హైదరాబాద్‌లో ప్రివ్యూ ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత, షో రన్నర్ ఉదయభాను మాట్లాడుతూ,'నిర్మాతగా మారాలనేది నా సాధారణ కల కాదు. దాదాపు 15 ఏళ్లుగా ఒక తపస్సు చేస్తున్నాను. టెలివిజన్‌లోనే పుట్టాను, ఉదయభాను కాస్తా హృదయ భానుగా మారింది అక్కడే.. అందుకే టెలివిజన్ నుంచే నా ప్రొడక్షన్ మొదలుపెట్టాలని ఇన్నేళ్లుగా ఎన్ని ప్రయత్నాలు చేశానో, ఎంత మంచి కంటెంట్ మోసుకుంటూ ఎక్కడికెక్కడికో వెళ్లానో నాకే తెలుసు. వచ్చేవారం, వచ్చే నెల మొదలవుతుంది అనుకుంటూనే ఆగిపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com